





www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
28-06-2024

సంపుటి : 01 | సంచిక : 55 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



V3 NEWS


## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు కోర్టులో ఎదురుదెబ్బ

### భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్లు డిస్మిస్

- 90 రోజుల్లో చార్జిషీటు దాఖలు చేయనందున బెయిల్ కోరిన నిందితులు
- పోలీసుల చార్జిషీట్‌ని కోర్టు తిప్పి పంపించిందని తెలిపిన న్యాయవాది
- పోలీసుల వాదనతో ఏకీభవించిన నాంపల్లి కోర్టు.. బెయిల్ నిరాకరణ



2

## నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్

### మెగా డీఎస్సీ అంటూ దగా

- జాబ్ క్యాలెండర్ ఊసే లేదు
- నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తాం
- నందినగర్ లో నిరుద్యోగులతో కేటీఆర్

**విశ్వంభభర, హైదరాబాద్:** తెలంగాణ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మెగా డీఎస్సీ అంటూ దగా చేశారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ వేస్తామని, ఉద్యోగాలు భర్తీ చేస్తామని తేదీతో సహా ప్రకటించింది మీరుకాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు సాంకేతిక కారణాలు సాకుగా చూపి మిగతా2లో...



## రేవంతే కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి మళ్లించారా?

### సీఎం సొంత గ్రామం కొండారెడ్డి పల్లిలో బీజేపీకి మెజారిటీ

- ఆయన జిల్లా, నియోజకవర్గంలో గెలిచింది బీజేపీనే..
- బీజేపీ పంచన చేరింది, మోడీ శరణు చొచ్చింది రేవంత్ రెడ్డే..
- మెదక్‌లో బీజేపీని బీఆర్ఎస్ గెలిపించిందని ఎలా అంటారు..?
- సీఎం స్థాయి వ్యక్తి గాలి మాటలు మాట్లాడటం సరికాదు
- సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్



2

తెలంగాణ రాష్ట్రంలో అన్ని శాఖలకు సమర్థమైన మంత్రులున్నారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడి మంత్రులు మెరుగ్గా ఉన్నారో లేరో చూడాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఢిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన రేవంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు పలు శాఖలకు మంత్రులు లేరని ఆరోపిస్తున్నారన్న రేవంత్, విద్యాశాఖ తన వద్దే ఉందని తెలిపారు. ఒక నిర్దిష్ట ప్రణాళికా ప్రకారం ముందుకెళ్తున్నామని వివరించారు. అభివృద్ధి పనుల కోసం మంత్రులు కేంద్రమంత్రులను కలుస్తున్నారని తెలిపారు. 6 సంక్షేమ పథకాలను అమలు చేయడమే ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు.



# కేసీఆర్ ముక్కు నేలకు రాయాలి

### ఫిరాయింపులకు పునాది వేసిందే చంద్రశేఖర్ రావు


- గతంలో 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను లాక్కున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పడగొట్టు ప్రకటనలు
- రంకెలు వేసిన బీఆర్ఎస్, బీజేపీని గాలికి వదిలేయాలా..?
- రాష్ట్రంలో అన్ని శాఖల మంత్రులు సమర్థవంతంగా పని చేస్తున్నారు
- జీవన్ రెడ్డికి తగిన గౌరవం ఇస్తాం.. ఆయన సేవలు పార్టీకి అవసరం
- జీవన్ రెడ్డిని అడ్డుపెట్టుకుని పార్టీకి చేటు చేయాలని గుంటనక్కల్లా చూశారు
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

2

### టీపీసీసీ చీఫ్‌గా ఎవరిని నియమించినా నో ప్రాబ్లమ్

- ముఖ్యమంత్రిగా వారితో కలిసి పని చేస్తా
- మూడేళ్ల అధ్యక్ష పదవి సంతృప్తిని ఇచ్చింది
- కేసీఆర్‌ను గద్దె దించాలనుకున్నా.. సీఎం కావాలనుకున్న
- ఒకేసారి రెండు కలలు నెరవేరాయి.. హ్యాపీ
- ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే నా ముందున్న కర్తవ్యం
- నాది జగన్‌లా కక్ష సాధింపు పాలన కాదు.. అలాంటి రాజకీయం చేయను
- ఢిల్లీలో మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

2



2

### సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ సక్సెస్

- సాగులోకి రానున్న ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల సాగు భూములు
- 2016 అప్పటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- పంపు హౌస్ ట్రయల్ రన్ ప్రారంభించిన కాంగ్రెస్ మంత్రి తుమ్మల
- ప్రాజెక్ట్ క్రెడిట్ మాదంటే మాది అని బీఆర్ఎస్, కాంగ్రెస్ ట్విట్టర్ వార్



5

### అమరావతి పేరు పెట్టింది రామోజీరావే..

- దేశంలోనే గొప్ప నగరంగా అమరావతి ఎదగాలని ఆకాంక్షించారు
- నవ్యాంధ్ర రాజధానికి నిర్మాణానికి రూ.10 కోట్ల విరాళం ఇస్తున్నాం
- రామోజీరావు పాటించిన విలువలను త్రికరణ శుద్ధిగా కొనసాగిస్తాం..
- రామోజీరావు సంస్మరణ సభలో ఈనాడు ఎండీ కిరణ్

## పదేళ్లలో సుస్థిర అభివృద్ధి

- ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతం
- ఆరోగ్య రంగంలో అగ్రగామి
- ప్రజా సంక్షేమం కోసం సంస్కరణలు
- ఎమర్జెన్సీ రాజ్యాంగంపై దాడి
- పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



9

### అసదుద్దీన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- పార్లమెంట్ లో 'జై పాలస్తీనా' అంటూ నినాదాలు
- రాష్ట్రపతికి నవనీత్ కౌర్ లేఖ



3

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 110 | ₹ 132 |
| **స్కిన్** | **స్కిన్‌లెస్** |
| ₹ 191 | ₹ 218 |

## నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు

### పార్టీ మారుతున్న ఎమ్మెల్యేలతో ఎలాంటి నష్టం లేదు

- బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలు ఉన్నారు
- వచ్చే ఎన్నికల్లో వారికే బీ ఫారాలు ఇచ్చి నిలబెడతా
- కాంగ్రెస్ పాలన రోజురోజుకు దిగజారుతుంది
- ప్రజలు పాలిచ్చే గేదెను అమ్మి దున్నపోతును తెచ్చుకున్నారు
- సంక్షేమ పథకాలు అందడం లేదని ఊర్లలో గగ్గోలు పెడుతుర్రు
- ఓపికతో ఉండండి.. ప్రజాసమస్యపై దృష్టి సారించండి
- ఎన్టీఆర్‌ను మళ్లీ ఎలా గద్దెనెక్కించారో బీఆర్ఎస్‌ను అలాగే కూర్చోబెడతారు
- ఎమ్మెల్యేలు, నాయకులతో మాజీ సీఎం కేసీఆర్



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరుసగా మూడో రోజు కూడా పార్టీ నేతలతో భేటీ నిర్వహించారు. ఎంపికచేసిన నియోజకవర్గాలవారీగా ముందస్తు సమాచారంతో నిర్దేశిత సమయం ప్రకారం అన్ని నియోజకవర్గాల కార్యకర్తలు నేతలతో ఆయన వరుస సమావేశాలు పెడుతున్నారు. అందులో భాగంగా నేడు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, హుజురాబాద్ మిగతా2లో...




### ఫామ్ హౌస్ లో స్వయంగా ఓమ్ని కారు నడిపిన కేసీఆర్

2

## కేసీఆర్ పిటిషన్‌ను సమ్మతించని హైకోర్టు

- జ్యుడీషియర్ కమిషన్ విచారిస్తే తప్పేముందని ప్రశ్న
- విచారణ నివేదికను అసెంబ్లీలో చర్చించొచ్చు కదా..?
- పిటిషన్ పై స్టే సమ్మతించలేం..
- విచారణ నేటికి వాయిదా వేసిన న్యాయస్థానం




**విశ్వంభర, హైదరాబాద్ :** కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇతర రాష్ట్రాల నుంచి చేసిన విద్యుత్ కొనుగోళ్లపై విచారణకు రేవంత్ సర్కారు నియమించిన మిగతా5లో...

## బోనాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించొద్దు



7

- ఉజ్జయిని మహంకాళి బోనాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు కోర్టులో ఎదురుదెబ్బ

**విశ్వంభర, హైదరాబాద్** : తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన నిందితులకు మరోసారి కోర్టులో చుక్కెదురైంది. అడిషనల్ ఎస్పీ భుజంగరావు, తిరుపతన్న, ఏసీపీ ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్లను నాంపల్లి న్యాయస్థానం డిస్మిస్ చేసింది. 90 రోజుల్లో చార్జిషీటు దాఖలు చేయనందున బెయిల్ కావాలని నిందితులు కోర్టుని కోరారు. తాము బెయిల్ పిటిషన్ వేసినప్పుడు కోర్టులో ఛార్జిషీట్ లేదని నిందితుల తరపు న్యాయవాది వాదనల సమయంలో కోర్టుకి తెలిపారు. అరెస్టైన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే బెయిల్ ఇవ్వొచ్చని వాదించారు. అయితే, తాము 90 రోజుల లోపే ఛార్జిషీట్ దాఖలు చేశామని పోలీసుల తరపు న్యాయవాదులు తెలిపారు. ఛార్జిషీట్ ని కోర్టు తిప్పి పంపించిందని, ఇలా పంపినంత మాత్రాన ఛార్జిషీట్ వేయనట్లు కాదని పోలీసుల తరపు న్యాయవాది వాదించారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు బెయిల్ పిటిషన్లను కొట్టి వేసింది.

**వీసా గడువు పొడిగించుకున్న ప్రభాకర్ రావు?**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న తెలంగాణ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా నుంచి రావాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్దల ఆదేశాలపై ప్రతిపక్ష నేతలతో పాటు పలువురు ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేయించారని ఆయనపై కేసు నమోదైంది. ప్రభాకర్ రావుని ప్రశ్నిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ భావిస్తోంది. ఇప్పటికే ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. ఆయన వీసా గడువు ముగిసిందని ఎప్పుడైనా ఇండియాక రావొచ్చని భావిస్తున్నారు. అనారోగ్య సమస్యల వల్ల చికిత్స కోసం వచ్చానని పోలీసులకు అందుబాటులో ఉంటానని జూన్ 26న భారత్ కు వస్తానని అడ్వకేట్ ద్వారా ప్రభాకర్ రావు కోర్టులో మెమో దాఖలు చేశారు. అయితే ఆయన రాలేదు. వీసా గడువు పొడిగించుకుని ఉండవచ్చని చెబుతున్నారు. మరో నిందితుడు శ్రవణ్ రావుకు కూడా కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

**మూడు బాక్సుల్లో ఆధారాలు...**

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎవిడెన్స్ మెటీరియల్ మొత్తాన్ని పోలీసు ఉన్నతాధికారులు కోర్టుకు సమర్పించారు. మూడు బాక్సులలో న్యాయస్థానంలో ఆధారాలు సమర్పించారు. ఇందులో హార్డ్ డిస్క్ లు, సిడీలు, పెన్ డ్రైవ్ లు ఉన్నాయి. ఈ మెటీరియల్ ఎవిడెన్స్ లు లేని కారణంగా రెండు సార్లు చార్జిషీటును కోర్టు వెనక్కి పంపింది. ఆధారాలు అన్నిటినీ జత పరుస్తూ పోలీసులు మూడోసారి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. అయితే ఈ ఆధారాలను నిందితులకు తెలీకుండా రహస్యంగా ఉంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనధికారికంగా ప్రైవేటు వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ గెలిచిన రోజునే ఆధారాలన్నీ శ్రవణ్ రావు ధ్వంసం చేసినట్లుగా తెలియడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

## నిరుద్యోగులను మోసం చేస్తోన్న కాంగ్రెస్

**(మొదటి పేజీ తరువాయి)**

తప్పించుకుంటున్నారన్నారు. గతంలో కేసీఆర్ ప్రకటించిన డీఎస్సీ ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు చేసి అదనంగా కేవలం 5వేల ఉద్యోగాలు మాత్రమే జోడించారన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 సంఖ్య పెంచకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈరోజు హైదరాబాద్‌లోని నంది నగర్ నివాసంలో తనను కలిసిన నిరుద్యోగ యువతకు ఈ మేరకు హామీ ఇచ్చారు కేటీఆర్. ఏ నిరుద్యోగులైతే కాంగ్రెస్‌కు అండగా నిలిచారో.. ఇప్పుడు వారే కథానాయకులై కాంగ్రెస్‌ను నిలదీస్తారని కేటీఆర్ చెబుతున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్ణయమే ఫైనల్ అన్న దానికి అనుగుణంగా పోస్టులను భర్తీ చేయండన్నారు. మొదటి సంవత్సరంలోనే 2లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని, మాటను నిలబెట్టుకోమని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వెంటనే వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల చేయండని, లేకుంటే విద్యార్థి, యువజన విభాగం తరఫున పెద్ద ఎత్తున ప్రత్యక్ష పోరాటానికి కూడా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈరోజు ఆయన నివాసంలో కలిసిన విద్యార్థులు, నిరుద్యోగులకు ధైర్యాన్ని ఇచ్చారు మాజీ మంత్రి కేటీఆర్.

## సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్ సక్సెస్



**(మొదటి పేజీ తరువాయి)**

అందించే ఉద్దేశంతో అశ్వాపురంలో సీతారామ ప్రాజెక్ట్ ని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు దాదాపు పూర్తైంది. ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి ప్రారంభించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే నేడు ట్రయల్ రన్ నిర్వహించింది. అయితే, 2004 కంటే ముందే దీనికి ప్రతిపాదనలు సిద్ధమైనా ప్రాజెక్ట్ పనులు రూపుదాల్చలేదు. 2016 ఫిబ్రవరి 16న కేసీఆర్ సీఎం హోదాలో శంకుస్థాపన చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో పనులు పూర్తి అయ్యాయి. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రాజెక్ట్ క్రెడిట్స్ మావంటే మావని చెప్పుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ వేదికగా పోటాపోటీగా కౌంటర్లు ఇచ్చుకుంటున్నారు. కేసీఆర్ కల సీతారామ ప్రాజెక్టు పూర్తయిందని బీఆర్ఎస్ చెప్పుకుంటుంటే... మీరు అవినీతితో ఆగమాగం చేయబట్టే 2014 లో ప్రారంభం కావాల్సినప్రాజెక్ట్ లేట్ అయిందని కాంగ్రెస్ కౌంటర్ ఇస్తోంది.

**నెరవేరిన కేసీఆర్ కల.. -బీఆర్ఎస్**

"నెరవేరిన తెలంగాణ సాధకుడు, మాజీ సీఎం కేసీఆర్ గారి కల.. సీతారామ ప్రాజెక్టు ట్రయల్ రన్ సక్సెస్. ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యంతో ఆగమైన తెలంగాణను పచ్చగా చేయడానికి కంకణం కట్టుకున్న కేసీఆర్ కల నిజమవుతున్న తరుణం.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 17 వేల కోట్ల అంచనాతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు మోటార్ల ట్రయల్ రన్ సక్సెస్. గంగమ్మ జల సవ్వడులతో తడిచిన ఖమ్మం నేల. ఉమ్మడి ఖమ్మం మరియు మహబూబాబాద్ జిల్లాలోని లక్షలాది ఎకరాలకు అందనున్న సాగు నీరు" అంటూ బీఆర్ఎస్ అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది. ఇక ఇదే పోస్టుని కేటీఆర్ రీట్వీట్ చేస్తూ.. "నీటిపారుదల రంగంలో కేసీఆర్ టీమ్ చేసిన అద్భుత కృషికి మరో ఉదాహరణ" అన్నారు. వీటికి కాంగ్రెస్ కూడా తమ అధికారిక ఖాతాలో కౌంటర్ ఇచ్చింది.

**కాంగ్రెస్ వస్తే రైతన్నల జీవితాల్లో వెలుగొచ్చే...**

"కల్వకుంట్ల డ్రామారావా! 2014 లోనే రూ. 3000 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టుని, మీ కమిషన్ల కోసం రీడిజైన్ పేరుతో రూ.18,500 కోట్లకు పెంచి పదేండ్లు ఆలస్యం చేస్తిరి. ప్రాజెక్టుకు అవసరం అయిన అనుమతుల్లో, భూ సేకరణలో, బాధితులకు పునరావాసం అందించడంలో నిర్లక్ష్యం చేసి, మీరు మాత్రం అందినకాడికి దోచుకుంటిరి. ప్రజా ప్రభుత్వం వచ్చాక, జనవరి 7, 2024 నాడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు ప్రాజెక్టు పురోగతిపై రివ్యూ నిర్వహించి, ఆరు నెలల్లో పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ మొదలుపెట్టారు. దాని ఫలితమే ఇప్పుడు నువ్వు చూస్తున్న ఈ గోదావరి జల కళ. మీకు తెల్సిందల్లా అవినీతితో.. ఆగమాగం ప్రాజెక్టులు కట్టి, పడగొట్టడం, పంపుహౌజులను కట్టి, వరదతో ముంచెత్తడం, మంచి చేసే వారిపై దుష్ప్రచారాలతో బురద జల్లడం. ఇప్పుడు చెప్పు.. కాంగ్రెస్ వస్తే ఏమొచ్చె! ఎగిసిపడే గోదావరమ్మ జల కల వచ్చె! తెలంగాణ రైతన్నల జీవితాల్లో వెలుగొచ్చె!" అంటూ కేటీఆర్ కి, బీఆర్ఎస్ కి కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చింది.

# టీపీసీసీ చీఫ్‌గా ఎవరిని నియమించినా నో ప్రాబ్లమ్

**విశ్వంభర, ఢిల్లీ:** టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తవారిని నియమించేందుకు ఏఐసీసీ కసరత్తు చేస్తోందనే ప్రచారం నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తన పీసీసీ అధ్యక్ష పదవీకాలం ముగిసిందని అన్నారు. పీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా వారితో కలిసి పని చేస్తానని, అధ్యక్షుడి నియామకంపై తనకంటూ ప్రత్యేక ఛాయిస్ ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. మూడేళ్ల అధ్యక్ష పదవి సంతృప్తిని ఇచ్చిందన్నారు. సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని, కొత్త పీసీసీ చీఫ్ నిర్ణయంపై నిర్ణయం తీసుకోవాలని రేవంత్ కోరారు. అధిష్ఠానం ఎవర్ని నియమించినా వారితో కలిసి పనిచేయడమే తన బాధ్యత అని అన్నారు. తాను టీపీసీసీగా ఉన్న కాలంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిందని, పార్లమెంటు ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచామని ఆయన ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికలకు మించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ పూర్తిగా ధ్వంసం అయింది. కేసీఆర్ గద్దె దించాలన్న ఆకాంక్ష నెరవేరింది. సీఎం కావాలనే తన కోరిక కూడా నెరవేరినట్టు వెల్లడించారు రేవంత్ రెడ్డి.



**జగన్ తరహా పాలన నాది కాదు.**

ప్రతీకార, కక్ష సాధింపు రాజకీయాలు చేయబోనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. "కేసీఆర్ విషయంలో ప్రతీకార రాజకీయాలు చేయను. జగన్ తరహా పాలన నాది కాదు. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే ఏం జరుగుతుందో ఏపీ ప్రజలు చూయించారు. అలాంటి తప్పుడు నిర్ణయాలు నేను తీసుకోను. కేసీఆర్‌ను గద్దె దించడమే ప్రజలు ఆయనకు వేసిన పెద్ద శిక్ష. కేసీఆర్‌ను గద్దె దించా.. సీఎం అయ్యా.. బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేసా. ఎన్నికలకు ముందు నేను చెప్పినవన్నీ జరిగాయి. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడమే నా ముందున్న కర్తవ్యం.నా కుటుంబంలో ఉన్నవారు నాకన్నా ఉన్నత స్థాయిలో ఉన్నారు. అధికార దుర్వినియోగం చేస్తే ఎవరిని ఉపేక్షించన"ని వార్నింగ్ ఇచ్చారు.

**అందుకే చేరికలను ప్రోత్సహిస్తున్నాం**

రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నెరవేరుస్తానని, ఏ విషయంలోనూ ప్రతిపక్షాలు విమర్శలు చేసేందుకు అవకాశం ఇవ్వబోనని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ ఒకటో తేదీ జీతాలు తీసుకోలేని 5 లక్షల ఉద్యోగులకు 1న జీతాలు ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో నమ్మకం కలిగిస్తే రాష్ట్ర అభివృద్ధికి వారు తనతో కలిసి పని చేస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలకు మేలు జరిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని, ఐదేళ్లపాటు సుస్థిర పాలన అందించడానికే చేరికలను ప్రోత్సహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### హైదరాబాద్‌కు అమరావతి పోటీ కాదు

హైదరాబాద్ అభివృద్ధికి తమ వద్ద అద్భుతమైన ప్రణాళికలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు అమరావతి పోటీ కాదని.. ఇప్పటికే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి ఇంకా లక్షల ఎకరాల భూమి ఉందని.. రూరల్, సెమి రూరల్ మాస్టర్ ప్లాన్‌తో ముందుకెళ్తామన్నారు. "విజన్ 2050 ప్రణాళికతో హైదరాబాద్ అభివృద్ధి చేస్తాం. తెలంగాణ చుట్టూ 12 జాతీయ రహదారులు ఉన్నాయి. నగరంలో నుంచి కనెక్టివిటీ పెంచుతూ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ పరిధిలో భూముల్ని అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా పనిచేస్తాం. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నా ధ్యేయమ"ని చెప్పారు.

# కేసీఆర్ ముక్కు నేలకు రాయాలి

**విశ్వంభర, ఢిల్లీ:** తెలంగాణ రాష్ట్రంలో అన్ని శాఖలకు సమర్థమైన మంత్రులున్నారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడి మంత్రులు మెరుగ్గా ఉన్నారో లేరో చూడాలని ప్రతిపక్షాలకు సూచించారు. ఢిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన రేవంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు పలు శాఖలకు మంత్రులు లేరని ఆరోపిస్తున్నారన్న రేవంత్, విద్యాశాఖ తన వద్దే ఉందని తెలిపారు. ఒక నిర్దిష్ట ప్రణాళికా ప్రకారం ముందుకెళ్తున్నామని వివరించారు. అభివృద్ధి పనుల కోసం మంత్రులు కేంద్రమంత్రులను కలుస్తున్నారని తెలిపారు. 6 సంక్షేమ పథకాలను అమలు చేయడమే ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు.

**జీవన్ రెడ్డి అనుభవాలను వినియోగించుకుంటాం :**

మరోవైపు రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బడ్జెట్ దృష్ట్యా నిధుల కోసం కేంద్రమంత్రులను కలుస్తున్నామని, త్వరలో ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో జీవన్ రెడ్డి వ్యవహారంపై స్పందించిన సీఎం, జీవన్ రెడ్డి అనుభవాలను పార్టీ వినియోగించుకుంటుందని తెలిపారు. జీవన్ రెడ్డి చర్యల వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరగాలని చూశారన్న ఆయన, కాంగ్రెస్ పట్ల జీవన్ రెడ్డికి ఉన్న నిబద్ధత వారికి అర్థం కాదన్నారు.

### కేసీఆర్ ముక్కు నేలకు రాయాలి

ఇదే సమయంలో పార్టీ ఫిరాయింపులపై స్పందించిన సీఎం, ఫిరాయింపులకు పునాది వేసిందే కేసీఆర్ అని ఆక్షేపించారు. గతంలో 61 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కేసీఆర్ లాక్కున్నారన్న రేవంత్, ఫిరాయింపులను ప్రోత్సహించినందుకు కేసీఆర్ ముక్కు నేలకు రాయాలని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కూలిపోతుందని కేటీఆర్, హరీశ్ అన్నారని గుర్తు చేసిన ముఖ్యమంత్రి, కేటీఆర్, హరీశ్ మాటలకు అప్పట్లో బీజేపీ వంతపాడిందన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని బీఆర్ఎస్, బీజేపీ రంకెలేశాయన్న రేవంత్ రెడ్డి, అలాంటి మాటలు మాట్లాడుతుంటే గాలికి వదిలేయాలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకోవడమే కేసీఆర్ భావదారిద్ర్యమని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటింగ్ శాతం 16 శాతానికి తగ్గిందన్న రేవంత్ రెడ్డి, కేసీఆర్‌కు ఇప్పటికీ కనువిప్పు కలగలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఎంపీ ఎన్నికల్లో బీజేపీని కేసీఆర్ గెలిపించారని ఆరోపించిన రేవంత్, కంచుకోటగా చెప్పుకునే మెదక్‌లో ఆ పార్టీ మూడో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఇప్పటికైనా ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు.

## రేవంతే కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి మళ్లించారా?

**(మొదటి పేజీ తరువాయి)**

పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అందులో 3 చోట్ల బీఆర్ఎస్ మెజారిటీ సాధించిందని తెలిపారు హరీశ్ రావు. రఘునందన్ రావు సొంత నియోజకవర్గం దుబ్బాకలో కూడా బీఆర్ఎస్ మెజారిటీ సాధించిందన్నారు. రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డి పల్లిలో బీజేపీకి మెజారిటీ వచ్చిందని వెల్లడించారు. అంటే.. రేవంతే అక్కడ కాంగ్రెస్ ఓట్లు బీజేపీకి మళ్లించారా? అని ప్రశ్నించారు హరీశ్ రావు. "రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన మహబూబ్ నగర్ లో బీజేపీ ఎలా గెలిచింది? మహబూబ్ నగర్ పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. వారంతా కలిసి బీజేపీని గెలిపించారా? కొడంగల్ లో రేవంత్ రెడ్డి 32వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. పార్లమెంటు ఎన్నికల్లో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి 21 వేల మెజారిటీ మాత్రమే వచ్చింది. మిగతా ఓట్లను రేవంత్ రెడ్డి బీజేపీకి వేయించారా? రేవంత్ ప్రాతినిథ్యం వహించిన మల్కాజిగిరిలో భారీ మెజారిటీతో బీజేపీ ఎలా గెలిచింది? ఈ రెండు చోట్ల కాంగ్రెస్ పార్టీ బీజేపీని గెలిపించిందా? బీజేపీ పంచన చేరింది, మోడీ శరణు చొచ్చింది రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీలో ఉండి భారతీయ జనతా పార్టీ అజెండా అమలు చేస్తున్నది ఎవరు? నిండు సభలో మోదీని పెద్దన్న అని సంబోధించింది రేవంత్ రెడ్డి కాదా? మోడీ, రేవంత్ కుమ్మక్కై సింగరేణిని ప్రైవేటుపరం చేస్తున్నారు. విభజన హామీలపై రేవంత్ రెడ్డి మోడీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడం లేదు. రెండు జాతీయ పార్టీలు కలిసి ప్రాంతీయ శక్తి అయిన బీఆర్ఎస్ ను టార్గెట్ చేశాయి. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటు" అని నిప్పులు చెరిగారు హరీశ్ రావు.

# నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు



**(మొదటి పేజీ తరువాయి)**

ప్రయాణం గమ్యాన్ని చేరుకుని తిరిగి స్వయం పాలన అనే గమనంలో దేశానికే ఆదర్శవంతమైన పాలననందిస్తూ స్వరాష్ట్రంగా పదేండ్ల అనతికాలంలోనే మరో ఉదాత్తమైన లక్ష్యాన్ని చేరుకుందన్నారు. తన 25 ఏండ్ల ప్రజా ప్రస్థానం ఇక్కడితో ఆగిపోలేదని, అయిపోలేదని మరెన్నో గొప్ప లక్ష్యాలను చేరుకుంటూ ముందుకు సాగాల్సి ఉందని కేసీఆర్ అన్నారు. ఆరు దశాబ్దాలపాటు దిక్కు మొక్కు లేక ఒక అదెరువు లేక కొట్టుమిట్టాడిన తెలంగాణను దరికి చేర్చేందుకు, నాడు ఉద్యమ కేతనమై ఎగిరిన గులాబీ జెండా రెపరెపలు... తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసె దాకా కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో ఆగమైతున్న తెలంగాణను అక్కున చేర్చుకుని మల్లా గాడిలో పెట్టేదాకా, కొనసాగుతూనే ఉంటుందని కేసీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధన అనే మహోన్నత లక్ష్యాన్ని సాధించిన. అంతటి ఉదాత్తమైన లక్ష్యంకోసం ఎన్నో పదవులను త్యాగం చేసిన చరిత్ర మనది. తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు అని కేసీఆర్ అన్నారు. "తెలంగాణ సాధించేనాటికి మనది సమైక్యపాలనలో దిక్కు మొక్కు లేని పరిస్థితి. సాగునీరు తాగునీరు కరెంటు వంటి అనేక కీలక వసతులను కల్పించుకున్నాం. తీర్చిదిద్దుకున్నాం. పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం. ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్నిసార్లు ఇట్లాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమౌద్ది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారు. పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయింది" అని పల్లెల్లో ప్రజలు బాధపడుతున్నారు" అని కేసీఆర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందట్లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారని కేసీఆర్ అన్నారు. సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు అందట్లేదన్నారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా కావట్లేదన్నారు. ఇవన్నీ ప్రజల మనసుల్లో రికార్డ్ అవుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారితప్పిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎటువంటి ఆందోళన చెందవద్దని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా ఇచ్చారు. "మన 25 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణం ఆగలేదు, అయిపోలేదు. నాడు ఎన్టీఆర్ ని తిరిగి ఎట్లైతే ప్రజలు గద్దెమీద కూర్చోబెట్టారో అంత కన్నా గొప్పగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరిగి ఆదరిస్తారని, అంతకంటే రెట్టింపు మద్దతుతో మనలను గద్దె మీద కూర్చుండ బెట్టే రోజు త్వరలోనే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రోజురోజుకు దిగజారుతున్నదన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నిచ్చెన మెట్లు ఎక్కేది పోయి మొదటి దశలోనే మెట్లు దిగజారుకుంటూ వస్తున్నదని విమర్శించారు. పార్టీ అనేది నాయకులను సృష్టిస్తదని, నాయకులు పార్టీలోకి వచ్చి పోతుంటారని, కొంతమంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎటువంటి తేడా రాదని కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి బుల్లెట్ల వంటి కార్యకర్తలున్నారని, వారినే నాయకులుగా తీర్చిదిద్దుకుందామని, బీఆర్ఎస్ పార్టీ బీ ఫార్మ్ ఇచ్చి అవకాశమిస్తే ఎవరైనా సిపాయీలుగా తయారౌతారని కేసీఆర్ తెలిపారు. ప్రజల్లో చైతన్యం వచ్చి తమకు కాంగ్రెస్ ద్వారా జరిగిన మోసాన్ని గుర్తించి తిరిగి బీఆర్ఎస్ ను ఆదరిస్తారని అప్పటిదాకా ఓపికతో ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని, పట్టుదలతో ప్రజల నడుమనే జీవించాలని కార్యకర్తలకు అధినేత పిలునిచ్చారు.



# ఫామ్ హౌస్ లో స్వయంగా ఓమ్ని కారు నడిపిన కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా కారు నడిపారు. ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ లో ఓమ్ని కారు నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. కాలుకి ఆపరేషన్ తర్వాత ఆయన కారు నడుపుతున్న వీడియోలు బయటకి రావడంతో అంతా షాకవుతున్నారు. అయితే ఆయన సరదా కోసమో, కాలక్షేపం కోసమో కారు నడపలేదు. డాక్టర్ల సూచన మేరకు కారు నడిపే ప్రయత్నం చేశారు. డాక్టర్ల సూచన మేరకు కేసీఆర్ ప్రతిరోజు కారును డ్రైవ్ చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఓల్డ్ మోడల్ మారుతి ఓమ్ని వెహికల్ ని తెప్పించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఫామ్ హౌస్ లో కాలు జారిపడటంతో కేసీఆర్ ఎడమ కాలి తుంటి ఎముకకు ఆపరేషన్ జరిగింది. అప్పటినుంచి మెల్లమెల్లగా నడక ప్రారంభించాలని డాక్టర్లు సూచించారు. తర్వాత రెండవ దశలో తుంటి గట్టి పడాలంటే మాన్యువల్ ట్రాన్స్మిషన్ ఉన్న కారు డ్రైవ్ చేయమని సలహా ఇచ్చారు. ఈ క్రమంలోనే కేసీఆర్ మాన్యువల్ గేర్ బాక్స్ ఉన్న ఓమ్ని కారుని ప్రతిరోజూ నడుపుతున్నారు. దీనివల్ల క్లచ్, గేర్, యాక్సిలరేటర్ పదేపదే నొక్కడంతో కాళ్లు తుంటి వెముకలు గట్టిపడతాయని డాక్టర్లు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో రోజూ వారి వ్యాయామంలో భాగంగా ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఆయన కారులోనే ఫామ్ హౌస్ మొత్తం చుట్టేస్తున్నారు.

**ర్యాలీలో భాగంగా స్వయంగా కారు నడిపిన కేసీఆర్...**

నిజానికి కేసీఆర్ కి కారు నడపడమంటే చాలా ఇష్టమని సన్నిహితులు చెబుతుంటారు. గతంలో తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు కార్ ర్యాలీలో భాగంగా ఆయనే స్వయంగా కారు నడిపారు. ఆ తర్వాత ఎంజి కంపెనీకి సంబంధించిన ఒక ఎలక్ట్రిక్ కారు కూడా కొనుగోలు చేసి ఆయన ఫార్మ్ హౌస్‌లో ఉపయోగించుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారం కోల్పోవడంతో కేసీఆర్ తన ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యారు. అక్కడే వ్యవసాయం పనులు చూసుకుంటున్నారు. కాలికి గాయమై యశోదాలో ఆపరేషన్ జరిగి డిశ్చార్జ్ అయ్యాక కొద్దిరోజులు నంది నగర్ లో నివాసమున్నారు. అనంతరం ఫామ్ హౌస్ కి వెళ్లిపోయారు.పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు ఉంటే తన ఫామ్ హౌస్ కే నాయకులను పిలిపించుకుని భేటీ అవుతున్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారానికి సంబంధించి ఫామ్ హౌస్ లోనే సమావేశాలు నిర్వహించారు. వరుసగా రెండు రోజులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీలతో భేటీ అయ్యారు. ప్రలోభాలకు లొంగొద్దని, పార్టీ మారొద్దని, భవిష్యత్తు మనదే అని భరోసా కల్పించారు. ఇకపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తరచూ కలుస్తాను అని హామీ ఇచ్చారు.

# అసదుద్దీన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**• 'జై పాలస్తీనా' అంటూ వ్యాఖ్యలు • రాష్ట్రపతికి మాజీ ఎంపీ నవనీత్ లేఖ**



**విశ్వంభర, ఢిల్లీ:** హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని అమరావతి మాజీ బీజేపీ నాయకురాలు నవనీత్ రాణా డిమాండ్ చేశారు. లోక్ సభలో ప్రమాణ స్వీకారం సందర్భంగా 'జై పాలస్తీనా' అని నినదించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆమె లేఖ రాశారు. ఒవైసీ తన ప్రమాణం స్వీకార కార్యక్రమంలో పాలస్తీనా పేరును లేవనెత్తడం ద్వారా భారత్‌కు బదులుగా మరో దేశానికి విధేయతను వ్యక్తం చేశారని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే తన డిమాండ్‌కు మద్దతుగా రాజ్యాంగంలోని 102, 103 ప్రకరణలను ఈ సందర్భంగా ఆమె ఉదాహరించారు. ఈ ప్రకరణలు ఒవైసీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయడానికి ఉపకరిస్తాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన సభ్యులు... ఎంపీలుగా ప్రమాణం చేశారు. ప్రమాణం సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ... జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై సభలోని పలువురు కేంద్ర మంత్రులతోపాటు వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో ప్రొటెం స్పీకర్ స్థానంలో ఉన్న రాధా మోహన్ సింగ్ స్పందిస్తూ... ఒవైసీ చేసిన వ్యాఖ్యలను పరిశీలించి రికార్డుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.



# సరళాదేవీ దంపతులకు సత్కారం

**విశ్వంభర, బషీర్‌బాగ్ :** హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆడిటర్ సరళాదేవీ పదవి విరమణ సందర్భంగా డీఈవో రోహిణి టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, సెక్రటరీ ఎం భాస్కర్ అసోసియేట్ ప్రెసిడెంట్ దేవిడ్‌లు పుష్ప గుచ్ఛం అందజేసి సరళదేవీ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ నరసింహ రావు, కోశాధికారి ప్రేంకుమార్, సంయుక్త కార్యదర్శి జయంతి రెడ్డి, ముజాహిద్ అలీ, చారీ, రమేశ్, సూర్య, అరుణ జ్యోతి, లావణ్య, మీర్జా, కనీజ్ ఫాతిమా, రజిత, కేపీ అనురాధ, జీ రాజ్‌కుమార్, ఫరూక్ అలీ, విజయలక్ష్మి, సీ రాజశేఖర్, చక్రవర్తి, ప్రవీణ, బసీర్ అహ్మద్ ఓవైస్, యువేందర్, సూర్య, వెంకటేశ్, అర్చన, నర్సింహ, ఖాజా షోయిల్ అహ్మద్, ఫయాజ్ అలీ, అజ్మత్, రాజేందర్, రాణీ, కౌసర్, హేమావతి, గిరిజ, రేణుక, జాకీర్, సాజిద్, సాయిలేక, శ్రీధర్, హమీద్, అల్తాఫ్, ఇమ్రాన్, దేవిప్రసాద్, జంబయ్య, కిరణ్, రాకేష్, లక్ష్మీపతి, శివ జ్యోతి, జాకీర్, సుధేష్ణ, కృష్ణ, గౌసియా, చైతన్య, సునీల్, సౌజన్య, సుకన్య, శ్రీకాంత్, ప్రవీణ్, శ్రీదేవి, అజీజ్, పరమేష్, కుశాల్, సాదత్, జమీల్, రవి, ఇమ్రాన్, కులకరిణి, అనూష, సఫ్దర్, సునీత, పూర్ణిమ, జాన్సి, శశికళ, రోషన్, మారతమ్మ పాల్గొన్నారు.

## గడ్డం మహేశ్ హత్య కేసులో ఇద్దరు అరెస్ట్

**విశ్వంభర, ఘట్కేసర్ :** గడ్డం మహేష్ హత్య కేసులో హత్యకు సహకరించిన శ్రీరాములు తండ్రి యాదగిరి, తోకరాజు తండ్రి బాలేష్ లు పరారీలో ఉన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్సీ నగర్‌లో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందగా ఇద్దరిని అదుపులో తీసుకొని విచారించి, కట్ట మహేశ్‌ను చంపిన కేసులో ప్రవీణ్‌కు శ్రీనివాస్ సహకరించినట్టు వెల్లడయింది. విచారణ అనంతరం వారిద్దరిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు.



## కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

**విశ్వంభర, నారాయణఖేడ్ :** పెద్ద శంకరంపేట మండలంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అనే అంశంపై గ్రామకార్యదర్శులు సర్వే చేపడుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి లబ్దిదారుడి ఆధార్, నల్లాను పరిశీలించి ఫోటోలను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తున్నారు. శనివారం లోగా సర్వేను పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా తెలిపారు.



## వనమహోత్సవనాకి ఏర్పాట్లు

**విశ్వంభర, నారాయణఖేడ్ :** త్వరలో ప్రారంభం కానున్న వనమహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చురుకుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలు, రహదారులకు ఇరువైపులా చెట్లను నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో గుంతలు తీసే పనులు చేపడుతున్నారు. ఆయా గ్రామాలలో ఈజీఎస్ సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆయా పనులను ఈజిఎస్ ఏపిఓ నవాజుద్దీన్ గురువారం పరిశీలించారు.



## సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతు న్నాయి. ఇందులో భాగంగా గురువారం మూల మంత్ర హోమం, పూర్ణాహుతి, శ్రీరామ సహిత శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతం నిర్వహిం చారు. తీర్థ ప్రసాద గోష్టి, అన్న ప్రసాదం, నిత్యం హోమం, అశ్వ వాహన సేవా. తీర్థ ప్రసాద గోష్టి. శేష వాహనం రథోత్సవం, ఊరేగింపు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, ఎల్బీనగర్ ఎసీపీ కృష్ణయ్య దంపతులు, దిల్‌సుఖ్‌నగర్ సాయి బాబా గుడి చైర్మన్ మల్లయ్య, సీఐ కాశీవిశ్వనాథ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## నర్సరీలను పరిశీలించిన డీఆర్డీఓ కృష్ణన్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండలంలోని కాటేపల్లి, నాంచారిపేట, ముత్తిరెడ్డిగూడెం, కొండాపురం, మోటాకొండూర్ గ్రామల్లోని నర్సరీలను గురువారం పరిశీలించిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి(డీఆర్డీఓ)ఎన్ కృష్ణన్ నర్సరీల పెంపకం సరిగా లేదని సిబ్బందిని మందలించారు. నర్సరీలలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ఐకేపీ ద్వారా స్కూల్ యూనిఫామ్ కుట్టుటకు ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించారు. వీరివెంటా స్థానిక ఎంపీడీఓ మేడి ఇందిర, ఎపీఓ అరుణ కుమారి, ఈసీ గోవర్ధన్, టీఏ ఏడవెల్లీ స్వామి, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఫ్ఏలు ఉన్నారు.



## వికలాంగులకు ట్రై స్కూటర్ల పంపిణీ

**విశ్వంభర, ఆమనగల్లు :** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఎమ్మెల్యేలతో కలిసి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంత్రి జూపల్లి జిల్లా కార్యాలయంలో వికలాంగులకు ట్రై స్కూటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్ కుమార్, సహచర ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.



## కేంద్రమంత్రులకు విందు ఇచ్చిన గవర్నర్ దత్తాత్రేయ

**న్యూఢిల్లీ, విశ్వంభర :** నరేంద్ర మోడీ క్యాబినెట్ లో తెలుగు రాష్ట్రాల నుండి నూతనంగా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ,కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ న్యూఢిల్లీలోని హరియాణా భవన్ లో విందుకు ఆహ్వానించి ఘనంగా సత్కరించడం జరిగింది.తెలుగు రాష్ట్రాల నుండి కేంద్రమంత్రులుగా దేశానికి ప్రాతినిధ్యం వహించడం చాల సంతోషంగా ఉందని ఇది తెలుగు వాళ్ళకే కాకుండా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు.తెలుగు వారు అయినా హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ మమ్ముల్ని విందుకు ఆహ్వానించి సత్కరించడం గొప్ప విషయమని మంత్రులు తెలిపారు.

## రాజ్‌గోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని గిరిప్రదక్షిణ

**అరుణాచలం, విశ్వంభర :** ఓ అభిమాని తనదైన శైలిలో తన నాయకుడి మీద ప్రేమను చాటుకున్నాడు. నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఎన్నికల్లో భారీ మెజారిటీ తో గెలుపొందాడు. తొలి జాబితాలో మంత్రి పదవి వస్తుందని నియోజకవర్గ నాయకులు , కార్యకర్తలు , అభిమానులు ఎంతోగానో ఎదురుచూసారు కానీ అప్పటి జాబితాలో కొంతమందికి మాత్రమే కేటాయించడం జరిగింది. మరి కొద్దీ రోజుల్లో మంత్రివర్గ విస్తారణలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావాలని తన అభిమాని మునుగోడు నియోజ కవర్గం చండూర్ వాసి లింగోజు కిరణ్ చారి అరుణాచలంలో అరుణాచలేశ్వరుడ్ని తలుచుకుంటూ గిరి ప్రదక్షిణ చేసాడు.






# తండ్రీ...నినుదలచి!

## కరీంనగర్‌లో ఏటా సమైక్య సాహితీ ఆధ్వర్యంలో విశిష్ట పురస్కారాలు

## ఆదర్శంగా నిలుస్తున్న స్నేహితులు ■ రేపు ప్రదానం

ముగ్గురు స్నేహితుల్లో చిగురించిన ఒక ఆలోచన ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన తమ తండ్రుల ప్రతిభాపాటవాలను ప్రపంచానికి చాటుతోంది. ఒక ఆదర్శాన్ని భావితరానికి అందిస్తోంది. తల్లి దండ్రులను, మూలాలను ఎన్నటికీ మరువరాదని సందేశం ఇస్తోంది. పలు రంగాల్లో వినుతికెక్కిన ప్రతిభామూర్తులను సమున్నతంగా సత్కరించుకుంటోంది. ఆ ముగ్గురు మాడిశెట్టి గోపాల్, కేవస్ అనంతాచార్య, రావికంటి శ్రీనివాస్‌లు. ఆ తర్వాత పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ జీ శ్యాంప్రసాద్ లాల్, డాక్టర్ రఘురామన్‌లు జత కలిశారు. ఏటా ఈ అయిదుగురు తమ తండ్రుల పేరిట సమైక్య సాహితీ ఆధ్వర్యంలో విశిష్ట పురస్కారాలను అందిస్తున్నారు.

పురస్కారం అంటే అర్పించడం, ఇవ్వడం.. బహుమతి... పరమాత్మునికి పూజ తరువాత పురస్కారం చేస్తాం అంటే ఏదైనా పండు, ఫలం.. వస్త్రాన్ని సమర్పించి ఆయనను ప్రసన్నం చేసుకుంటాం. పురః కర అంటే పురస్కారం. గౌరవంగా అందించడం. ఇలాంటి అభ్యాసం మనకు పెద్దవాళ్ల నుంచి అలవడుతుంది. అనూచానంగా వచ్చే సంప్రదాయాన్ని కొనసాగించడమే సంస్కృతిలో భాగమవుతుంది. అలాంటి గొప్ప సంస్కృతిలో ఒకటి పురస్కారం. దీనినే అవార్డు అని కూడా అంటారు. ఒక నిర్దిష్ట రంగంలో పనిచేసిన వారి అద్భుతమైన కృషికి అందించే శ్రేష్టమైన గుర్తింపు పురస్కారం. అంటే ప్రతిఫలం ఆశించకుండా అందించేది. ఒక అసాధారణ సామర్థ్యానికి, సృజనకు లేదా అత్యధిక నిబద్ధతకు అందించే ప్రశంసాపూర్వక సమర్పణ. రాజుల కాలంలో కవిపండితులను, కళాకారులకు భూములు, నగదు, బంగారు ఆభరణాలు, గ్రామాలను నజరానా కింద అందించి ప్రోత్సహించారు. అనేకమంది రాజులు దీనిని అనుసరించారు.

ప్రస్తుతం ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు కూడా అవార్డులు ప్రకటిస్తున్నాయి. కళా సాహితీ సంస్థలు సైతం ఈ బాధ్యతను భుజానికి ఎత్తుకొని నిర్వహిస్తున్నాయి. అలాంటి వాటిలో కరీంనగర్ చెందిన సమైక్య సాహితీ కూడా ఒకటి. జన్మనిచ్చిన జనకుల విశేషాలను లోకానికి జ్ఞాపకం చేస్తూ.. ఆ బాటలో నడిచిన ఉన్నతశ్రేణి కవి పండితులను, కళాకారులు, అధ్యాపకులకు అందించే పురస్కారాలే సమైక్య సాహితీ విశిష్ట పురస్కారాలు.

2017 నుంచి ఏటా ఈ పురస్కార ప్రదానోత్సవాలను నిర్వహిస్తున్నారు. కోవిడ్ కారణంగా 2020, 2021లలో ఈ కార్యక్రమాలు జరగలేదు. శాలువా, మెమెంటోలతో సత్కరించడమే కాకుండా క్యాష్ అవార్డును కూడా ఇస్తున్నారు. ఈ సంవత్సరం జూన్ 29న ఈ పురస్కార ప్రదానోత్సవం కరీంనగర్‌లో జరగనుంది.

ఒక్క 2019లో మాత్రం తుమ్మల రంగస్థల పురస్కారాన్నికూడా ఇదే వేదిక నుంచి రచయిత, నాటక కళాకారుడు పెద్దింటి అశోక్‌కుమార్‌కు ప్రదానం చేశారు.

### కలకుంట్ల సంపత్ కుమారాచార్య సంగీత పురస్కారం




కలకుంట్ల సంపత్ కుమారాచార్య

కరీంనగర్‌కు చెందిన కలకుంట్ల సంపత్ కుమార్ ఆచార్యుల వేళ్లు హార్మోనియంపై సున్నితంగా కదులుతుంటే కర్ణపేయమైన సుస్వారాలు వినిపించాయి. ఆయన స్వరపరిచిన రాగాలు సంగీత ప్రియులను అలరించాయి. పరిచితరాగాలతో ప్రసిద్ధిగాంచిన సంగీతజ్ఞులు సంపత్ కుమారాచార్యులు. ఆయన వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. తను అడుగుపెట్టిన ప్రతి పాఠశాలలో పిల్లలు రాగాలు తీస్తుంటే విద్యాధికారులు ఆశ్చర్యపోయిన సందర్భాలెన్నో. హార్మోనియంలో ఉన్న ప్రతిభతో పాఠశాలల్లో పిల్లలచే నాటకాలు ఎన్నో ప్రదర్శింపజేశారు. భక్త ప్రహ్లాద, లవకుశ, శకుంతల, కృష్ణరాయబారం, భక్త సిరియాలతో పాటు సాంఘిక నాటకాలను విద్యార్థులను విద్యార్థులతో ప్రదర్శింప జేశారు. రవాణా సౌకర్యం లేని రోజుల్లోనూ ఎన్నో గ్రామాల్లో నాటకాలు వేయించారు. సంగీత పరిజ్ఞానంతోపాటు తెలుగు సాహిత్యం కూడా పరిచయం ఉంది. కరీంనగర్లో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో ఆనాటి కలెక్టర్‌తో పురస్కారం అందుకున్నారు. సంగీత కళాకారుడిగా ఉపాధ్యాయుడిగానే కాకుండా ఆ రోజుల్లో పెద్దపల్లి ప్రాంతంలో ఆర్ఎంపీగా పని చేశారు. వారి సేవలు స్ఫూర్తిగా నిలవాలని వారసుడు కేవస్ అనంతాచార్య తండ్రి పేరిట ఏటా ఒక సంగీత విద్వాంసునికి పురస్కారం అందజేస్తున్నారు. ఈ ఏడాది సంగీత విద్వాంసుడు, తెలుగు రాష్ట్రాలలో వేలాది మందిని గాయకులుగా తీర్చి దిద్దుతున్న సంగీత గురువు రామాచారికి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. గతంలో రాఖీ, కొరిడె నరహరి, రామయ్య శర్మ, జయకుమారాచారి, కేబీ శర్మలకు ఈ పురస్కారం దక్కింది.



రామాచారి

### ఆచార్య రజనీశ్రీ నాట్య పురస్కారం



ఆచార్య రజనీశ్రీ

హుస్నాబాద్‌కు చెందిన ఆచార్య రజనీశ్రీ కళా రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం పొందారు. ప్రముఖ నాట్యాచార్యులుగానే కాకుండా నటుడు, దర్శకుడు, కవి, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారు. 1959 నుంచి 2002 వరకు సాహిత్య రంగంలో.. నాటక రంగంలో అత్యంత ప్రతిభ చాటారు. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉంటూనే సామాజిక చైతన్యం కోసం నాటకాల ప్రదర్శనలిచ్చి ప్రజాభిమానం పొందారు. కూచిపూడి, కథక్ ఆంధ్ర భరతనాట్యాలను అలవోకగా ప్రదర్శించారు. జానపద నృత్యాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. సాంస్కృతిక రంగంలో నిబద్ధత కలిగిన కళాకారుడుగా ఉంటూనే అదే నిబద్ధతతో ఉపాధ్యాయ వృత్తిలో 37 ఏళ్లు పనిచేశారు. 1990లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా కలెక్టర్ నుంచి, 2000 సంవత్సరంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు. విభిన్న రంగాల్లో కృషిచేసిన రజనీ శ్రీ స్ఫూర్తి కొనసాగాలని ఆయన తనయుడు, ప్రస్తుత పెద్దపల్లి జిల్లా సంయుక్త పాలనాధికారి జీవీ శ్యాం ప్రసాద్ లాల్ పురస్కారాన్ని అందిస్తున్నారు. తొలుత తండ్రి గురువైన డాక్టర్ మలయశ్రీకి రజనీ శ్రీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తర్వాత ప్రసిద్ధ ఆంధ్ర నాట్య కళాకారులు కళాకృష్ణకు, ప్రముఖ నచ్చే కళాకారులు అంజిబాబుకు, ఈ అవార్డు ఇచ్చారు. ఈ సంవత్సరం ప్రముఖ పేరిణి నృత్య కళాకారుడు ప్రకాశ్‌కు ఈ పురస్కారం ప్రకటించారు.



పేరిణి ప్రకాష్

### మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారం



మాడిశెట్టి మల్లయ్య

విధి నిర్వహణ అనేది ప్రతి మనిషి వ్యక్తిత్వానికి అందం తీసుకొస్తుందని భావించేవారు ఉపాధ్యాయుడు మాడిశెట్టి మల్లయ్య. ఆట, పాట, మాటలన్నింటినీ సమన్వయం చేసుకొని విద్యార్థులకు బోధించిన అక్షర సూర్యుడాయన. చిన్నతనంలో తండ్రిని కోల్పోయిన తల్లి ప్రోత్సాహంతో చదువుకొని ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డారు. గణితాన్ని బోధించి గణాంకాలతో ఆటలాడించిన అధ్యాపకుడాయన. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వ్యవహరించి విధులు నిర్వహించారు. వచ్చునూరు గ్రామానికి చెందిన ఈయన సొంత ఊరును ఆకుపచ్చనూరుగా మార్చారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆయన తనయుడు మాడిశెట్టి గోపాల్ తండ్రి పేరిట ఏటా ఒక ఉత్తమ ఉపాధ్యాయుడికి పురస్కారం అందిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రముఖ పాఠ్యపుస్తక రచయిత, ఉత్తమ ఉపాధ్యాయుడు, జాతీయవాది గాజుల రవీందర్‌కు ఈ పురస్కారం ప్రకటించారు. గతంలో మానేటి ప్రతాపరెడ్డి, అవసర రాజయ్య, లక్ష్మీనారాయణ, సువర్ణ వినాయక్, పోరెడ్డి రంగయ్యలకు ఈ పురస్కారం దక్కింది.



గాజుల రవీందర్

### రావికంటి రామయ్య గుప్త సాహితీ పురస్కారం



రావికంటి రామయ్య గుప్త

తెలంగాణ సాహితీ చరిత్రలో ఆరిపోని కవివరేణ్యుడు రావికంటి రామయ్య గుప్త. వేద శాస్త్రాల పుట్టినిల్లుగా భావించే మంథనిలో జన్మించిన రామయ్య ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. మంత్రకూట వేమనగా ప్రసిద్ధి పొందారు. మాటలాడుతున్నంత తేలికగా ఆటవెలది పద్యాలు రాసేవారు. ఆశువుగా అందరినీ అలరించారు. అందుకే రెడీమేడ్ పోయెట్ (ఆర్.ఎం.పి)గా పేరు పొందారు. అలతి అలతి పదాలతో ..హాస్య చతురోక్తులతో సహజ కవిగా, ప్రజాకవిగా సాహితీ లోకంలో నిలిచారు. కల్లగాదు రావికంటి మాట మకుటంతో ఎన్నో పద్యాలు రాసి సామాజిక చైతన్యం తెచ్చారు. తన చుట్టూ ఉండే పరిసరాలు, సందర్భాలు, వేడుకలు జ్ఞాపకాలను ఆసరా చేసుకుని పద్య రచన చేశారు. ఆయన ఏ పద్యం పాడినా గుండెలను తాకేది. ఆయన నీతి, నిజాయితీ, నిర్భీతితో శిరమెత్తి, కరమెత్తి కవిత్వాన్ని అందించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ రూపొందించిన పాఠ్యపుస్తకాల్లో వీరి పద్యానికి చోటు లభించింది . ఈ ఘనత సాధించిన ఆ కవికి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి మంథని సమాజం గౌరవాన్ని చాటుకుంది. వీరు రాసిన వాసవీగీత అనేక కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో మారుమోగుతోంది. మంథని గౌతమేశ్వరుని స్తుతిస్తూ గౌతమేశ్వర శతకం, కన్యకాపరమేశ్వరి శతకం, వరహాల భీమన్న జీవిత చరిత్ర (బుర్రకథ), వరద గోదావరి ఉయ్యాల పాట లాంటివి ఎన్నో రాశారు. వారి వారసుడు రావికంటి శ్రీనివాస్ తండ్రి పేరున ఏటా సాహిత్య పురస్కారాన్ని అందిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రముఖ పద్యకవి, అవధాని, పండితులు ముద్దు రాజయ్యకు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. గతంలో మాడుగుల మురళీధర శర్మ, అల్లం వీరయ్య, ఎం నారాయణ శర్మ, అవుసుల భాను ప్రకాశ్, కొల్లారపు ప్రకాశరావు శర్మలు ఈ పురస్కారం పొందారు.



ముద్దు రాజయ్య

### డాక్టర్ దారం నాగభూషణం పరిశోధన పురస్కారం



డా. దారం నాగభూషణం

డాక్టర్ నాగభూషణం కరీంనగర్‌లో పేరెన్నిక గన్న వైద్యులు. సామాజిక చింతనతో ప్రజల పట్ల అమితమైన అనురాగంతో సేవ చేసేవారు. చారిత్రక అంశాల పట్ల, వస్తువుల పట్ల ఆసక్తితో తపాలా బిళ్లలు, నాణేలు ఇతర రకాల వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేశారు. క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలు మూర్తీభావించిన వ్యక్తిత్వం అయినది. అవసరం ఉన్న మందులు మాత్రమే రాసి, న్యాయబద్ధమైన ఫీజు తీసుకొనే డాక్టర్‌గా ఆయన గొప్ప పేరు సంపాదించుకున్నారు. వారి సామాజిక సేవలు గుర్తించి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన వయో శ్రేష్ఠ సన్మాన్ అవార్డు ప్రకటించగా ఆనాటి భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా ఆ పురస్కారాన్ని తీసుకున్నారు. 2013లో ఉమ్మడి రాష్ట్రంలో జీవన సాఫల్య పురస్కారాన్ని పొందారు. ప్రవృత్తి రీత్యా పురావస్తు సేకరణలో అగ్రగణ్యుడిగాపేరు పొందారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, ప్రాచీన కళలు, ఆచార వ్యవహారాల పట్ల మక్కువతో.. వాటిని ప్రతిబింబింపజేసే అరుదైన కళాఖండాలను, అబ్బురపరిచే వస్తువులను సొంత డబ్బులతో సేకరించి భద్రపరిచారు. తన సతీమణి పేరిట దారం సుశీల మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వారి స్మారకార్థం ఆయన తనయుడు డాక్టర్ రఘురామన్ 2023 నుంచి పరిశోధన పురస్కారాన్ని అందిస్తున్నారు. తొలుత చరిత్ర పరిశోధకుడు సంకేపల్లి నాగేంద్ర శర్మకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సంవత్సరం తెలంగాణ నవ చరిత్ర పరిశోధకులు ద్యావనపల్లి సత్యనారాయణకు ఈ అవార్డు ప్రకటించారు. పురస్కారాలు.. సృజనకు సోపానాలు.



ద్యావనపల్లి సత్యనారాయణ

(మయూఖ ఆన్ లైన్ పత్రిక సౌజన్యంతో)




- రావికంటి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్
9908892067

# "రాజకీయ దురంధరుడు పాములపర్తి"

సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సానుకూల వాతావరణం ఏర్పరచుకుని పరిపాలన సాగించిన వాడే సమర్థుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పీవీ నరసింహారావు.

## పీవీ జయంతి సందర్భంగా..



దక్షిణ భారతావని నుంచి ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పీవీ"గా లబ్ద ప్రతిష్టులైన ఆయన బహు భాషావేత్త, రచయిత, స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు.

ఆంధ్రప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు.1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు.

1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్య నీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయ; 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రి; జూలై 1984 డిసెంబర్ 1984 కేంద్ర హోం శాఖమంత్రి; నవంబరు 1984 ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 జూన్, 1988 కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి; జూలై 1986 ఫిబ్రవరి 1988 కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి; జూన్ 1988 డిసెంబర్ 1989 విదేశ వ్యవహారాల శాఖ మంత్రి; 1991 మే 29 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగా; జూన్ 1991 - 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు.

సీఎం పీఠం అధిష్టించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్టానంతో చర్చించేందుకు ఢిల్లీ హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ భూ గరిష్ట చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలలో, టిడిపి పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోక సభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు.

భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తేర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణల 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచివేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే.1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూగరిష్ట పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసిందీ పి.వి.నే.

**ప్రధానిగా ఆయన హయాంలో..**

1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవి వైఖరి వివాదాస్పదమైంది. ప్రధానిగా ఐదేళ్ళ పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి. బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడగలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు. 196874 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్‌సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాద మయింది. 1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయతీ పరులు. చివరి దశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి. నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన.

పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి,19.10.2009 న ప్రారంభించారు. పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసిఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసిఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసిఆర్, తెలుగు జాతి మహోన్నత వ్యక్తికి తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.

- రామ కిష్టయ్య సంగనభట్ల
9440595494



## అమరావతి పేరు పెట్టింది రామోజీరావే..

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభకు పాత్రికేయ, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. విజయవాడ శివారు కానూరులోని అనుమోలు గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభకు రామోజీరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రామోజీరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ క్రమంలోనే అమరావతి కోసం రామోజీ గ్రూప్ రూ.10 కోట్లు విరాళం అందించింది. ఈ మేరకు రామోజీ కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు విరాళం చెక్కు అందించారు. నాన్నగారి సంస్మరణ సభకు హాజరైన అందరికీ నమస్సులు అని కిరణ్ తెలిపారు. నవ్యాంధ్ర రాజధానికి అమరావతి పేరును నాన్నగారే సూచించారని, దేశంలోనే గొప్ప నగరంగా అమరావతి ఎదగాలని నాన్నగారు ఆకాంక్షించారని ఆయన పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాంతం పరితపించిన వ్యక్తి రామోజీరావు అని కిరణ్ పేర్కొన్నారు. ప్రజల హక్కులను పాలకులు కబళించి నప్పుడల్లా ఆయన బాధితుల పక్షం వహించే వారని తెలిపారు. దేశంలో ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండేవారని చెప్పారు. ఆయన నమ్మిన పాటించి న విలువలను త్రికరణ శుద్ధిగా కొనసాగిస్తామని తమ కుటుంబ సభ్యులు, తన తరఫున సభాముఖంగా మాటిస్తున్నట్లు కిరణ్ ప్రకటించారు.

## అవన్నీ పీఆర్ స్టంట్లు

- రోగులు విలవిల్లాడుతున్నారు
- పనికిమాలిన పథకాలపై కోట్లు ఖర్చు పెడుతున్నారు
- బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆరునెలల తరువాత జిలాల్లో అధికారికంగా తిరగడానికి ముఖ్యమంత్రికి తీరింది అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీపై దాడులు, ఢిల్లీ టూర్లు.. కేసులు నమోదు.. పీఆర్ స్టంట్లు చేయించడం ఇవ్వన్నీ పూర్తి చేసుకుని పర్యటనకు వెళ్తున్నారన్నారు. ఉద్యమాల గడ్డ ఓరుగల్లు పర్యటన మొదట ఎంచుకోవడం మంచిదే కానీ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభించడానికి వెళ్లడం విడ్డురంగా ఉందన్నారు. ఓరుగల్లు పర్యటన సందర్భంగా సీఎంకు మా 5 డిమాండ్లు అన్నారు. ఎంజీఎంను సందర్శించాలి, కేసీఆర్ శంకుస్థాపన చేసిన మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరగా పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలి, ఎయిమ్స్ ఆస్పత్రిలో ఉన్న సమస్యలు తీర్చాలి, కాకతీయ తోరణం ఉంచుతారా లేదా..? సీఎం వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. గొప్ప చరిత్ర ఉన్న ఎంజీఎం సందర్శించాల్సింది పోయి కార్పొరేట్ ఆస్పత్రి సీఎం తన చేతులతో ఓపెన్ చేయబోతున్నారన్నారు. రాష్ట్రంలో దయనీయంగా ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. ఆస్పత్రిలో తక్కువ మంది వైద్యులతో రోగుల భారీ క్యూ లైన్లు కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో టెస్టుల కోసం ప్రైవేట్ సంస్థలపై ఆధారపడాల్సి వస్తుందని ఆరోపించారు. ఎంజీఎం ఆస్పత్రిలో సరిపడ బెడ్లు లేవు, పారమెడికల్ విధానం లేదు, ఒక్కో బెడ్‌లో ఇద్దరు ముగ్గురు రోగులు ఉంటున్నారన్నారు. చాలి చాలని వసతుల మధ్య చికిత్స చేస్తున్న డాక్టర్లకు మొక్కాలని, ఎంజీఎం ఆస్పత్రిలో కరెంట్ 5 గంటల పాటు లేకపోవడంతో రోగులు విలవిల్లాడారన్నారు. కాంగ్రెస్ పాలన అటకెక్కిందని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడినట్లుగా ఉందని, స్వతంత్ర దేశంలో ఉచిత వైద్యం కోసం ఇంకా మీడియా ముందు మాట్లాడం దురదుష్టకరం అన్నారు. ఆరోగ్యశ్రీలో ఏ వ్యాధికి వర్తిస్తుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అది తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనికిమాలిన పథకాల మీద కోట్లు ఖర్చు పెడుతున్నారని, అదికాకుండా పేద వాడి ఆరోగ్యం కోసం ఖర్చు చేయాలని కోరారు.

## బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ విద్యార్థికి ఆర్థిక సాయం

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అందజేత



**విశ్వంభర, ఉప్పల్:** ఉప్పల్ నియోజకవర్గం చిలుక నగర్‌కి చెందిన గోపి శెట్టి చెన్న కేశవుల కుమారుడు శశి కుమార్ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్ సాధించాడు. మెడిసిన్ చదువు చదివే స్థోమత లేక ఇబ్బంది పెడుతున్న విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ట్రస్ట్ ద్వారా గురువారం మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఎర్ర వెల్లి ఫాం హౌస్ లో 60 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ సీటు సాధించిన వారికి 5 సంవత్సరాలకు అయ్యే ఫీజు మొత్తం చెల్లిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బుగ్గరెడ్డి ఆసుపత్రి ఎదుట శవంతో ఆందోళన

- ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు

**విశ్వంభర, షాద్ నగర్ :** నియోజకవర్గంలోని బుగ్గరెడ్డి ప్రైవేట్ హాస్పిటల్‌లో ఈనెల 20వ తేదీ గురువారంన వైద్యం కోసం కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన మహేష్ అనే 30 సంవత్సరాల యువకున్ని వారి బంధువులు వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. అతని పరిస్థితి చూసి వైద్యులు హైదరాబాద్ ఉస్మానియా లేదా గాంధీకి తీసుకెళ్లాలని సూచించినట్లు వారి బంధువులు మీడియాతో తెలిపారు. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. మహేష్‌ను మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ అంబులెన్స్ లో హైదరాబాద్ కు ప్రయాణ మయ్యారు కానీ అంబులెన్స్ సిబ్బంది పట్టణంలోని బుగ్గరెడ్డి హాస్పిటల్‌లో మెరుగైన చికిత్స అందిస్తున్నారు అని సూచించారు. వారి మాట విని వెనుదిరిగి బుగ్గారెడ్డి ఆసుపత్రికి మహేశ్‌ను తరలించి వైద్యము కోసం ఈనెల 20 న చేర్పించారు. ఆరు రోజులు బుగ్గరెడ్డి ఆసుపత్రి వైద్యులు అతని పరిస్థితి చూసి కిడ్నీలకు సంబంధించి డయాలసిస్ చెయ్యాలని హైదరాబాద్ మహావీర్‌కు పంపించారు. అక్కడ డయాలసిస్ చేస్తున్న క్రమంలో మహేష్ ప్రాణాలు కోల్పోయాడు. అక్కడ డయాలసిస్ చేసిన డాక్టర్లు రెండు రోజుల క్రితం తీసుకొస్తే బ్రతికేవాడని ఇంత విషమించే వరకు ఏం చేశారని నిలదీశాడని వారు తెలిపారు. బుగ్గరెడ్డి ఆసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా తమ కుటుంబ సభ్యుడి ప్రాణాలు తీశారని, వాళ్ళ నుంచి కానప్పుడు ముందే చెబితే తమ మహేష్ బ్రతికే వాడని మీడియా ముందు బోరున విలపించారు. తమకు న్యాయం జరిగే వరకు శవాన్ని తియ్యమని బగ్గారెడ్డి ఆసుపత్రి ఎదుట శవంతో ఆందోళన చేపట్టారు. ఇదిలా ఉంటే డాక్టర్ లు ఆసుపత్రి యాజమాన్యం మాత్రం వారు డబ్బులు కట్టే స్థోమత లేక ఇక్కడికి వచ్చారు. అతని ఆరోగ్యం ఇంతలా దెబ్బ తినడానికి అతను వాడిన ఆయుర్వేద ఔషధం కారణమని చెబుతున్నారు. బాధితులు మాత్రం మేము వైద్యం కోసం రెండు లక్షలకు పైగా ఖర్చు పెట్టాం అయినా తమ మహేష్ ప్రాణాలు తీశారని తమకు న్యాయం జరిగే వరకు శవాన్ని తియ్యమని ఆసుపత్రి ఎదుట బైఠాయించారు.

## కేసీఆర్ పిటిషన్‌ను సమ్మతించని హైకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషనుపై గురువారం వాదనలు జరిగాయి. ఈ కేసులో తీరును తెలంగాణ హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. విద్యుత్ విచారణ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని, జస్టిస్ నరసింహారెడ్డి విలేఖరుల సమావేశం పెట్టి వివరాలు వెల్లడించారని కేసీఆర్ తరపు న్యాయవాది ఆదిత్య సోంది వాదించారు. విద్యుత్ కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని కేసీఆర్ కు కమిషన్ నోటీసులు జారీ చేసిందని దీనిపై కేసీఆర్ సమాధానం ఇవ్వకముందే జస్టిస్ నరసింహారెడ్డి వివరాలు వెల్లడించారని ఆదిత్య సోంది పేర్కొన్నారు.

### ఈఆర్సీ తీర్పులపై విచారణ చేయకూడదు

ఈఆర్సీ ఇచ్చిన తీర్పు ప్రకారం ఛత్తీస్ గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు చేశామని పిటిషనర్ తరఫు న్యాయవాది ఆదిత్య వాదనలు వినిపించారు. ఈఆర్సీ ఇచ్చిన తీర్పులపై జ్యుడీషియరీ కమిషన్ వేసి విచారణ చేయకూడదని, ఆ విషయం తెలిసి కూడా కమిషన్ వేశారని ఆదిత్య పేర్కొన్నారు.

### విచారణ జరిపితే తప్పేముంది : హైకోర్టు

జ్యుడీషియర్ కమిషన్ విచారిస్తే తప్పేమిటని కేసీఆర్ ను హైకోర్టు ప్రశ్నించింది. విచారణ నివేదిక వచ్చిన తర్వాత అసెంబ్లీలో ప్రవేశపెట్టి, చర్చించొచ్చు కదా అని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయ పడింది. పిటిషనర్ వాదనలు విన్న తర్వాత తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. కేసీఆర్ పిటిషన్ పై స్టే హైకోర్టు సమ్మతించలేదు.

### విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై విచారణ

గత కేసీఆర్ ప్రభుత్వం ఛత్తీస్ ఘడ్ నుంచి విద్యుత్ కొనుగోలు చేయడంలో అక్రమాలు జరిగాయని, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో లోపాలు జరిగాయని రేవంత్ సర్కారు జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో న్యాయవిచారణ కమిషన్ ను నియమించింది. ఈ కమిషన్ విచారణ జరుపుతుండగానే కేసీఆర్ దీనిపై హైకోర్టులో పిటిషన్ వేశారు.

## అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** ప్రజాపాలనలో పారదర్శకతే అత్యంత ప్రామాణికమని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ గౌరవమైన పాలన అందించాలన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అభివృద్ధిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన జిల్లా ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్నలతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలను అందించి ప్రభుత్వ సంస్థలపై నమ్మకం కలిగేలా అధికారుల చర్యలు ఉండాలన్నారు. అధికారులు ప్రజలను గౌరవిస్తూనే వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల న్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇందిర మ్మ పాలన అందించాలనే కృత నిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలో రైతులందరికి సాగునీరు అందించేందుకు ప్రాజెక్టులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు భూసేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులు, ములను కాపాడేందుకు ప్రత్యేక చొరవ చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ధరణి సమస్యలు ఎదుర్కొంటున్న రైతుల వివరాలను ప్రతీ గ్రామంలో గుర్తించి పరిష్కరించాలన్నారు. ఇక నుంచి ప్రతీ రెండు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఉంటుందని మంత్రి తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, చీర్ల శ్రీనివాసులు, జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి పెద్ద పీట

ఉద్యోగాలను కల్పించేలా ప్రత్యేక జాబ్ వెబ్ పోర్టల్ : మంత్రి సీతక్క




**విశ్వంభర, హైదరాబాద్:** దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే సంకల్పంతో దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవన్ ఆవరణలో గురువారం దివ్యాంగుల ఉద్యమ సారధి, హక్కుల కార్యకర్త హెలెన్ కెల్లర్ విగ్రహావిష్కరణ అనంతరం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున హెలెన్ కెల్లర్ 144వ జయంతి ఉత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దివ్యాంగులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన వరకే ప్రభుత్వం పరిమితం కాకుండా సంక్షేమ బడ్జెట్లో దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన 5 శాతం నిధులను వెచ్చిస్తున్నమని తెలిపారు. దివ్యాంగుల ఉపకరణాల కోసం గత ప్రభుత్వం ఏడాదికి రూ. కోటి ఖర్చు చేస్తే.. తమ సర్కార్ ఈ ఏడాది రూ.71 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించిందని వెల్లడించారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలను, లాప్‌టాప్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఉపకరణాలను మంత్రి స్వయంగా అమర్చారు. ప్రైవేటు రంగంలో దివ్యాంగులకు ఉద్యోగాలను కల్పించేలా ప్రత్యేక జాబ్ వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. మీసేవా కేంద్రాలకు వెల్లకుండానే దివ్యాంగులు సదరం సర్టిఫికేట్ పొందేలా ప్రత్యేక యాప్‌ను ప్రారంభించారు. వైకల్యం ఉందని ఎవరూ కుంగిపోకుండా హెలెన్ కెల్లర్ స్ఫూర్తిగా ముందుకు సాగలన్నారు. వికలాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. దివ్యాంగులకు అసరగా ఉండే ఉపకరణాల కోసం ఈ ఏడాది రూ.71 కోట్ల భారి మొత్తాన్ని కేటాయించినట్లు గుర్తు చేశారు. ఉన్నత విద్యా సంస్థల్లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన వరకే ప్రభుత్వం పరిమితం కాకుండా సంక్షేమ బడ్జెట్‌లో దివ్యాంగులకు జనాభా ప్రతిపదికన ఐదు శాతం నిధులను కేటాయించామని మంత్రి సీతక్క వెల్లడించారు. దివ్యాంగులను ఆర్థికంగా ముందంజలో నిలిపేందుకు వ్యాపారాల్లోనూ వారిని ప్రోత్సహిస్తామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తికి త్వరలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తామని అన్నారు. 21 రకాల వైకల్యాలను గుర్తించి సదరం ధృవీకరణ పత్రాలను త్వరలో జారీ చేస్తామని తెలిపారు. వికలాంగులు మీసేవా కేంద్రాల వద్ద పడిగాపులు పడకుండా ఇంటి నుంచే సదరం ధృవీకరణ పత్రాల ప్రక్రియను పూర్తి చేసేలా యాప్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పోరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ, వికలాంగులు, వయోవృద్ధులు సాధికారత శాఖ డైరెక్టర్ శైలజ, ఎండీ ప్రభంజన్, ఇతర అధికారులు, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.



## నేడు పదవ తరగతి సప్లిమెంటరీ ఫలితాలు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పదవ తరగతి సప్లిమెంటరీ ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు ఎస్సెస్సీ బోర్డు అధికారులు ఫలితాలను విడుదల చేయనున్నారు. అనంతరం ఫలితాలను అధికారిక వెబ్ సైట్ లో చూసుకోవొచ్చు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఇక పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైన విషయం తెలిసిందే. 93.23 శాతం బాలికలు, 89.42 శాతం బాలురు ఉత్తీర్ణత సాధించారు. 3,927 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత కాగా, ఆరు పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇక గతేడాది వార్షిక పరీక్షలో 89.60 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 91.31 శాతానికి పెరిగింది. ఈ ఏడాది వార్షిక పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించారు. 2,57,952 మంది బాలురు, 2,50,433 మంది బాలికలు సహా మొత్తం 5,08,385 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అయితే, సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులు.. ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ‘ఉపాధి’ వేతనం చెల్లించరూ...

## జీవితం గడవటం చాలా కష్టంగా ఉంది

## ఉపాధి హామీ కూలీల ఆవేదన



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం వ్యవసాయంమే జీవనాధారంగా జీవితాన్ని గడుపుతున్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు. ఈ నవీన కాలంలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా యంత్రాలు ఉపయోగించి పనులు చేస్తూన్నారు. ఒకప్పుడు వ్యవసాయ పనులైన దుక్కిదున్నటానికి, నారుమళ్లు సిద్ధం చేయడానికి, వరి చేలలో మరియు మెట్టపంటలకు (చెల్కపంటలలో)కలుపు తీతకు, పంటల కోతలకు, పంటలను నూర్పిడి చేయడానికి, తదితర పనులకు పశువుల సహాయంతో నాగల్లు, చదును చేయడానికి గొర్రుల నాగల్లు, చేనుల్లో కలుపు మొక్కల నివారణకు దుమ్ము గుంటకలు తోలడానికి, తదితర పనులకు మనుషులను (కూలీలును) ఉపయోగించే వారు కానీ మారిన పరిస్థితుల్లో వ్యవసాయానికి యంత్రాల వాడంకం పేరిగీ మనుషుల వాడకాన్ని తగ్గించడంతో వ్యవసాయరంగం నుంచి కూలీలను నెట్టి వేయబడిన పరిస్థితుల్లో కూలీలకు జీవనానికి అవరోధం ఏర్పడింది. కూలీల జీవనానికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో 2005 లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టి ఎందరికో



జీవనానికి ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారు ఆర్థికంగా అభివృద్ధిలో రావడానికి ఉపాధి హామీ పథకం ఉపయోగపడుతుంది. కానీ గతంలో వారంవారం ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వేతన చెల్లింపులు జరుగుతుండేవి. కానీ ప్రభుత్వం క్రమక్రమంగా వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం చేస్తుండటంతో కూలీల జీవనానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలా ఆలస్యంగా వేతనాల చెల్లింపుల వలన కూలీలకు ఆర్థిక ఇక్కట్లు ఎక్కువై ఉపాధి హామీ పనులకు రావడానికి సుముఖత వ్యక్తం చేయడంలేదు. ప్రభుత్వం, అధికారులు వత్తిడి వలన ఉపాధి హామీలో కిందిస్థాయిలో పనులు చేస్తున్న ఉద్యోగులు కూలీలను పనులకు రావాలని బలవంతంగా తీసుకుని వచ్చి పనులు చెపిస్తున్న సందర్భాలున్నాయి. అలా వారిని కూలీ డబ్బులు ఇవ్వాలని నిలదీస్తుండటంతో ఏమీ చేయలేక మానసికంగా కృంగిపోతున్నారు. కూలీలకు సరైన సమయంలో వేతనాలు రాకపోవడంతో వారు ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉంది అంటున్న ఉపాధి హామీ కూలీలు. ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు స్పందించి కూలీలకు రావాల్సిన వేతనాలను వారంవారం వెంటవెంటనే చెల్లించాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

### వారంలో కూలీ చెల్లించాలి



ఉపాధి హామీ పని చేసిన వారంలో కూలీ చెల్లించాలి. గతంలో వారం వారం కూలీ డబ్బులు ఫోస్టు మ్యాన్ మా ఊరికి వచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు మేము ఫోస్టు ఆఫీసుకు వెళ్ళినా కూడా మీ డబ్బులు పడలేదు అంటున్నారు. మా కుటుంబం గడవటానికి చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాము. గతంలో మాదిరిగానే ఏ వారం డబ్బులు ఆ వారమే వచ్చేలా చేయాలని కోరుతున్నాను.

– కోన్న మల్లమ్మ (తిమ్మాపూరం)

### డబ్బులు రాక 2నెలలు అవుతుంది



ఉపాధి హామీ పనిలో భాగమైన గ్రామ నర్సరీలో వనసేవకురాలుగా పనిచేస్తున్న డబ్బులు రాక 2నెలలు అవుతుంది. కుటుంబం గడవటానికి చాలా ఇబ్బందికరంగా ఉంది.పనిచేసిన వారంలో డబ్బులు ఇవ్వాలి. రైతుల వద్ద పనికి వెళ్ళితే పని ముగియగానే డబ్బులు ఇస్తారు. కానీ ఈ ఉపాధి హామీ పనిలో కనీసం వారం తర్వత కూడా డబ్బులు పడటం లేదు. ప్రభుత్వం అధికారులు ఏ వారం కూలీ ఆ వారం వచ్చే విధంగా చూడాలని కోరుతున్నాను అని అన్నారు.

– కుర్రాముల మంజుల (ఆత్మకూరు(ఎం))

---

# ప్రతి పథకంలో కేసీఆర్ ప్రథమ ముద్దాయి

## ఇంకా ప్రభుత్వంలో ఉన్నట్లు భ్రమ పడకండి

## టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ప్రతి పథకంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రథమ ముద్దాయిగా ఉన్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. గురువారం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పవర్ కమిషన్‌పై.. మేము దొంగతనం చేస్తాం కానీ మమ్మల్ని ఎవరు అడగొద్దు అనేలా బీఆర్ఎస్ వాదన ఉందని ఎద్దేవా చేశారు. ఏ కమిషన్ వేసినా కమిషన్‌ను ప్రశ్నించడం, ఎదురు దాడి చేయడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. విద్యుత్ కమిషన్ విషయంలో హై కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుందామని సూచించారు. ఏ కమిషన్ వేసినా దానికి సమాధానం చెబుతామని బీఆర్ఎస్ నేతలు అన్నరు.. అలాంటప్పుడు ఎందుకు హైకోర్టును ఆశ్రయిస్తున్నరని ప్రశ్నించారు. మీ నాయకుడిని హౌస్‌కి రమ్మంటే రాడుని.. ఆయన వస్తే ప్రతి అంశం సభలోనే చర్చిస్తామని అన్నారు. బీఆర్ఎస్‌కు అసెంబ్లీలో ఏ అంశాలు ఎత్తుకోవాలని తెలవడం లేదని సెటైర్ వేశారు. రైతు రుణమాఫీని రాజశేఖర్ రెడ్డి తర్వాత ఇప్పుడు మళ్లీ రేవంత్ రెడ్డి సర్కార్ చేసిందని అన్నారు. ఆ తర్వాత వచ్చిన ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేకపోయారన్నారు. రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు అజెండా ఏందో ఫిక్స్ చేసుకోండని బీఆర్ఎస్‌కు చురకలంటించారు. ఫ్రీ బస్ బాగోలేదని.. ఆటో వాళ్ళను ఎగేస్తున్నారని మండిపడ్డారు. ఫ్రీ బస్సు ఉండదని అబద్ధాలు చెబుతున్నారని ఫైర్ అయ్యారు. ప్రభుత్వ పథకాల్లోల ఏమైనా లోపాలు ఉంటే సలహాలు సూచనలు ఇవ్వండన్నారు. ప్రతి అంశంపైన కేసీఆర్ పేరు చర్చకు ఎందుకు వస్తుందో తెలుసుకోవాలని అన్నారు. కమిషన్లను తప్పుపట్టడం, విచారణ తప్పుపట్టడం బీఆర్ఎస్ మానుకోవాలని హితవు పలికారు. జాబ్ కేలండర్‌ను ప్రిపేర్ చేస్తున్నాం.. ప్రభుత్వాన్ని అబాసు పాలు చేసే వాళ్ళ ట్రాప్‌లో నిరుద్యోగులు పడొద్దని సూచించారు. సామాన్యుడు చెబితే కూడా కాంగ్రెస్ వింటది.. ఇంకా ప్రభుత్వంలో ఉన్నట్లు భ్రమ పడకండి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన ఇచ్చిన అన్ని గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని ప్రజలు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

---

# పేదవారికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- డీఎంహెచ్ఓలు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, హైదరాబాద్:** పేదవారికి మెరుగైన వైద్యం అందించడమే మా ప్రభుత్వ ప్రాధాన్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం అన్ని జిల్లాల డీఎంహెచ్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీఎంహెచ్ఓలు ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, ప్రజారోగ్యాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. డీఎంహెచ్ఓలు ప్రైవేటు ఆసుపత్రులలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అని ఆయన చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యారోగ్య సేవా కార్యక్రమాల ప్రోగ్రాములను ఎలా కో- ఆర్డినేట్ చేయాలనే దానిపై డిఎంహెచ్ఓలకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలను ప్రజలకు అందించడంలో డీఎంహెచ్ఓలది గురుతరమైన బాధ్యత అని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జిల్లా, ఏరియా, పీహెచ్సీల మధ్య భౌగోళికంగా కనెక్టివిటీపై దృష్టి సారించాలని డీఎంహెచ్ఓలకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రతి 30 కిలోమీటర్ల దూరంలో ఒక ప్రభుత్వ హెల్త్ సెంటర్ ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రుల లైసెన్స్ రద్దు చేయాలి అని చెప్పారు. తదుపరి సమావేశానికి డీఎంహెచ్ఓలు పూర్తి సమాచారంతో రావాలి అని తెలిపారు. పేదవాడికి ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలి.. ఆసుపత్రుల్లో ప్రభుత్వ వైద్యుల అటెండెన్స్ తప్పనిసరిగా మెయింటైన్ చేయాలి.. జిల్లాల వారిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు డీఎంహెచ్ఓలదే బాధ్యత అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి అని వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు. రోగులకు మెరుగైన డైట్‌ను అందించాలని, డాక్టర్లు విధిగా సమయపాలన, మెరుగైన వైద్య సేవలను అందించేలా డీఎంహెచ్ఓలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా విస్తృత సేవలను అందించాలని మంత్రి ఆదేశించారు. ఆరోగ్య మందిర్లలో అదనపు సేవలను అందించడానికి కృషి చేయాలన్నారు. డీఎంహెచ్ఓల పని తీరును మెరుగుపరచుకోవాలని ఆదేశించారు.

---

# నేను పార్టీ మారడం లేదు

## కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం : ఎమ్మెల్యే కోవా లక్ష్మి



**విశ్వంభర, ఆసిఫాబాద్:** అధికారం కోల్పోయి కష్టాల్లో ఉన్న బీఆర్ఎస్‌కు ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఇటీవల వరుస షాకులు ఇస్తున్నారు. స్టేట్‌లో పవర్ కోల్పోవడం, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా విజయం సాధించకపోవడంతో గులాబీ ఎమ్మెల్యేలు పక్క పార్టీల వైపు చూస్తున్నారు. బీఆర్ఎస్‌లోనే ఉంటే తమ రాజకీయ మనుగడ ప్రమాదంలో పడుతుందన్న భయంతో ఇప్పటి నుండే పక్కదార్లు వెతుక్కుంటున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్ చెప్పి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం, సంజయ్‌లు బీఆర్ఎస్‌ను వీడి అధికార హస్తం పార్టీ గూటికీ చేరారు. వీరి బాటలోనే మరికొందరు గులాబీ ఎమ్మెల్యేలు పయనించే అవకాశం ఉందని జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి పార్టీ మారుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీ మార్పు వార్తలపై ఆమె స్పందించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. తను పార్టీ మారుతున్నట్టు వస్తున్న తప్పుడు వార్తలను ఎమ్మెల్యే కోవాలక్ష్మి ఖండించారు. తాను పార్టీ మారడం లేదని ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కొంతమంది బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అనేక పదవులు అనుభవించి.. ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు వెళ్లిపోతున్నారని పార్టీ మారిన నేతలపై తీవ్ర స్థాయి-ంలో మండిపడ్డారు. కోవాలక్ష్మి స్పందించడంతో ఎట్టకేలకు ఆమె పార్టీ మార్పు వార్తలకు తెరపడింది.

---

# సీఎం రేవంత్ వరంగల్ పర్యటన వాయిదా!



**విశ్వంభర, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన వాయిదా పడింది. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. షెడ్యూల్ ప్రకారమైతే.. నేడు వరంగల్‌లో పర్యటించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, కేబినెట్ విస్తరణ లాంటి కీలకమైన విషయాలతో అధిష్ఠానంతో చర్చిస్తోన్న రేవంత్ రెడ్డి.. నేడు కూడా పార్టీ పెద్దలతో భేటీ కానున్నట్టు తెలుస్తోంది. దీంతో రేపటి వరంగల్ పర్యటన వాయిదా పడినట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి సహా.. పలువురు మంత్రులు ఢిల్లీలోనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలపై భేటీ అవుతున్నారు. తెలంగాణకు రావాల్సిన ప్రయోజనాలతో పాటు.. పెండింగ్‌లో ఉన్న అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. అటు పీసీసీ చీఫ్, కేబినెట్ విస్తరణపై కూడా పార్టీ పెద్దలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై చర్చించారు. కాగా.. పీసీసీ పదవి నుంచి తాను తన కర్తవ్యం నిర్వర్తించానని.. వేరే వాళ్లకు అవకాశం ఇవ్వాలంటూ ఉదయం మీడియా సమావేశంలో చెప్పిన రేవంత్ రెడ్డి.. ఆ పదవి ప్రస్తుతం ఉన్న నాయకుల్లో ఎవరైతే సరిగ్గా సరిపోతారన్న అభిప్రాయాన్ని అధిష్ఠానంతో చెప్పినట్టు సమాచారం. తన పరిశీలనలో ఉన్న పలువురి పేర్లను అధిష్ఠానం ముందు ఉంచగా.. ఆ పేర్లపై పెద్దలు చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసమే.. రేవంత్ రెడ్డి ఇవాళ కూడా అక్కడే ఉండాల్సివస్తోందని సమాచారం.

## మూసారంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



**విశ్వంభర, మూసారంబాగ్ :** మూసారంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి పనులను గురువారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ట్రాఫిక్ డైవర్షన్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తోపాటు కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ సురేష్, డీఈ రేణుక ,ఏఈ ప్రశాంత్ పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

**విశ్వంభర, మీర్‌పేట్ :** మీర్‌పేట్, ఆర్ఎన్ రెడ్డి కాలనీలోని సాయిబాబా దేవాలయంలో శ్రీ నేత్రాలయ ఐ హాస్పిటల్, సంతోష్ నగర్ వారి నేతృత్వంలో కలాం ఫౌండేషన్ మరియు కాలనీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కంటి శిబిరమును, కాలనీ అధ్యక్షులు శ్రీ రామ్ కిషన్ రావు అడ్వకేట్ కాలనీ పెద్దలతో కలిసి ప్రారంభించారు. 200 మంది ఈ శిబిరంలో ఉచిత పరీక్షలు చేయించుకున్నారు.

## ఓవైసీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్**



**విశ్వంభర, కరీంనగర్ :** హైదరాబాద్ పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఓవైసీ తన ఎంపీ ప్రమాణ స్వీకార సందర్భంగా పార్లమెంటు సాక్షిగా దేశ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించి, జై పాలస్తీనా అనే నినాదాన్ని చేసి, విదేశాన్ని కీర్తించినందుకు ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ముజీబ్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఉంటూ దశాబ్దాలుగా రాజ్యాధికారాన్ని ఏలుతున్న ఓవైసీ నిజస్వరూపం ఏంటో దేశ ప్రజలందరూ గ్రహించాలన్నారు. జై భారత్ అని ఏనాడు అనని, ఓవైసీ మతంతో మాత్రమే ముడిపడి ఉన్న ఫలస్తిన్‌కు పార్లమెంటు సాక్షిగా జై కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓవైసీ ఎంపీ అవ్వడానికి ఓటు వేసింది భారతీ-యులా..? ఫలస్తీనీయులా..? అని ప్రశ్నించారు. ఫలస్తీనా మీద ఓవైసీకి ఎన్నెలేని ప్రేమ ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతుందని, అందుకే ఆయన పార్లమెంటు సభ్యత్వానికి తక్షణం రాజీనామా చేసి పాలస్తీనకు వెళ్లి అక్కడ పోటీ చేయాలన్నారు. జై పాలస్తీనా అన్నా ఓవైసీ దేశద్రోహి అని, దేశ రాజ్యాంగానికి నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందున తక్షణం ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్‌తో గురువారం ఢిల్లీలో భేటీ అయిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ బండి పార్థసారథి రెడ్డి

**– విశ్వంభర, న్యూఢిల్లీ**



హైదరాబాద్ ప్రైవేట్ స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంకు టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే వినతి పత్రం ఇచ్చారు. అలాగే గురుకుల పాఠశాలల్లోని ప్రత్యేక కోటా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**– విశ్వంభర, హైదరాబాద్**

# బోనాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించొద్దు

- ఉజ్జయిని మహంకాళి బోనాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్




**విశ్వంభర, హైదరాబాద్:** జులై 7 నుండి జరిగే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు దేవాలయాల వారీగా సమీక్ష సమావేశాలు కొనసాగుతున్నాయి. జూలై 21, 22 వ తేదీల్లో జరిగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జులై 5 లోపే నగరంలోని అన్ని దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 21వ తేదీ బోనాలు, అమ్మవారి దర్శనం కార్యక్రమాలు ఉండగా, 22 వ తేదీ ఉదయం 9 గంటలకు రంగం, గజాదిరోహణ మహోత్సవం అంబారిపై అమ్మవారు ఊరేగింపు కార్యక్రమం ఉండనుంది. ఈసారి మహ లక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిగా వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. 1830 నుంచి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ప్రతి సంవత్సరం బోనాలు సమర్పిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. అమ్మవారి ఆశీర్వాదంతో బోనాలు విజయవంతం అయ్యేలా ప్రజల సహకారం ఉండాలని కోరారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. మహంకాళి బోనాలు అంటేనే హైదరాబాద్ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట ఉంటుందని ఈసారి బోనాల ఉత్సవాలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో 20 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఆలయ పరిసరాల్లో లైటింగ్, ఆ మూడు రోజుల పాటు నిరంతర నీటి సరఫరా, నిరంతర విద్యుత్ ఏర్పాటుతో పాటు అదనపు ట్రాన్స్ఫార్మర్‌లు ఏర్పాటు, పోలీసుల సమక్షంలో భారీ కెడ్లు చేపట్టాలని తెలిపారు. తాగునీటికి వాటర్ పాకెట్స్, వాటర్ బాటిల్స్, 4 హెల్త్ క్యాంప్‌లు, శిక్షణ పొందిన పిసిఆర్ బృందాలు, ప్రత్యేక అంబులెన్స్, ఫైర్ ఇంజన్స్, వెల్ కమ్ బోర్డుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంట్రీ, ఎక్సిట్ గేట్లు, ఎమర్జెన్సీ గేట్లు, ప్రత్యేక క్రైం టీమ్స్, మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలు, ఏనుగు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలనీ ఊరేగింపు సమయంలో రోప్ పార్టీ ఏర్పాటు, క్రైం టీమ్స్, షీ టీమ్స్ ఏర్పాటు, 500 మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, బోనాల రోజు ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రోటోకాల్ వెహికల్స్ తప్ప తమ వాహనాలు కూడా దేవాలయానికి దూరంగా ఆపి అమ్మవారి దర్శనానికి వచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఏర్పాట్ల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తుల దర్శనానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏ సమస్య ఉన్న స్థానికులు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అమ్మవారి ఉత్సవాలు విజయవంతంగా జరగాలంటే స్థానికుల సహకారం ఉండాలన్నారు. సమీక్షా సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, సెక్రటరీ హన్మంతరావు, సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోటా నీలిమ, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్, దేవాలయ కమిటీ, ఇతర స్థానిక ముఖ్య నేతలు, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, వాటర్ వర్క్స్, విద్యుత్ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజులు నియంత్రించాలి

**షాద్‌నగర్ యువసత్తా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో దీక్ష**




**విశ్వంభర, షాద్‌నగర్ :** నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాల ఫీజులు నియంత్రించాలని షాద్‌నగర్ యువసత్తా అధ్యక్షులు లక్ష్మణ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. యువసత్తా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫీజులు ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఉన్నత చదువులు చదవాలని ప్రైవేట్ పాఠశాలని ఆశ్రయిస్తే వారి అవసరాన్ని ఆసరగా తీసుకొని ప్రవేట్ పాఠశాలలు చేస్తున్న డిమాండ్ మంచిది కాదన్నారు. షాద్ నగర్ పాఠశాలలో ఉండే ఉపాధ్యాయులు ఒక్కసారి ఆలోచించాలి హైదరాబాద్ తరహా ఫీజులు వసూలు చేయొద్దని తెలిపారు. ఇరుకైనా గదులు,గాలి వచ్చి పోయే అవకాశం లేదు. ఫీజులు ఆలస్యం ఐతే విద్యార్థిని అంటరాని వాడిగా బయట నిలబెట్టి అవమానించిడం, ప్రశ్నించడం చేతకాని తల్లి తండ్రులు, పిల్లల ప్రాణాలకు గ్యారంటీ లేదు. పదవ తరగతి ఫలితాలు వచ్చి ఎన్ని రోజులు అయినప్పటికీ ఇప్పటివరకు వాళ్లకు టీసీలు అందజేయలేదని వాపోయారు. కొద్ది రోజుల కిందట మేద పాఠశాలలో జరిగిన విద్యుత్ షార్ట్ కొట్టడంతో ఆసుపత్రిలో ఉన్నాడు, అతనికి సంబంధించిన ఖర్చులు అన్ని మేద పాఠశాల యజమాన్యం భరించాలని కోరారు. ఈ దీక్షలోరిటైర్డ్ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ సాయి ప్రసాద్, పాలమాకుల్ సారా వినయ్ కుమార్, ఆర్టిఏ యాక్ట్ జంగయ్య అడ్వకేట్, రహమతుద్దీన్ అడ్వకేట్, త్రివేది నరసింహ, జంగయ్య టియం ఎమ్మార్పీఎస్, సూర్య నాయక్ గిరిజన నాయకులు, చెన్నగల అశోక్ ఎమ్మార్పీఎస్, బిఆర్ఎస్ యువ నాయకులు ప్రవీణ్, ఉదయ్, శ్రీకాంత్, ఇంద్ర, ఇంతియాజ్, రవితేజ, రాజు, యువసత్తా ప్రధాన కార్యదర్శి మాధవాచారి, కందివనం నవీన్ కుమార్,సిద్దు గౌడ్, రాములుగౌడ్, రమేష్, అభినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి : సీపీఎం




**విశ్వంభర, వలిగొండ :** తొర్రూర్ డబుల్ రోడ్డు వెడల్పులో భాగంగా అంబేద్కర్ విగ్రహం నుంచి పవిత్రాత్మ పాఠశాల వరకు ఏర్పాటుచేసిన డివైడర్‌కు ఎలాంటి హెచ్చరికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెంటనే హెచ్చరిక బోర్డులు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. సీపీఎం ఆధ్వర్యంలో పవిత్రాత్మ పాఠశాల ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. వలిగొండ నుంచి తిరుమల గిరి వరకు నిర్మించిన డబల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వలిగొండ అంబేద్కర్ విగ్రహం నుంచి పవిత్రాత్మ పాఠశాల వరకు ఏర్పాటు చేసిన డివైడర్ ముగింపులో ఎలాంటి హెచ్చరికల బోర్డు, స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇటీవల ఒక టాటా ఏసీ బండి డివైడర్ పైకి ఎక్కిన పరిస్థితి ఉందన్నారు. పాఠశాల ఉండటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి వెళ్తుంటారని స్పీడ్ గా వచ్చే వాహనాల వల్ల ప్రమాదం ఉందని వెంటనే రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి డివైడర్ ముగింపులో హెచ్చరిక బోర్డును మరియు పవిత్రాత్మ పాఠశాల ఆవరణలో స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, మండల నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, రంగారెడ్డి, సలిగంజి మురళీ కృష్ణ, నర్సింహ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ప్రత్యేక పూజలు

**విశ్వంభర, చింతపల్లి :** దేవరకొండ శాసనసభ్యులు గిరిజన ముద్దుబిడ్డ నేనావత్ బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వూరే లక్ష్మణ్ శ్రీదేవి దంపతులు చింతప ల్లి మండలం మాల్ పట్టణంలోని శ్రీ రామలింగే శ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలునాయక్ కు మంత్రి పదవి వస్తే వేనుకపడిన దేవరకొండ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నదని కాంగ్రెస్ పార్టీ జాతీయ, రాష్ట్ర అధిష్టానాన్ని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీకి మూడు దశాబ్దాలుగా సేవలంది స్తూ, రెండు సార్లు శాసన సభ్యునిగా లక్షలాది మంది ప్రజల, వేలాది మంది కార్యకర్తలకు భరోసగా ఉంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషిచేస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మంత్రి పదవి ఇవ్వాలన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** యోగాతో మానసిక ప్రశాంతతతోపాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరి కృష్ణ అన్నారు. ఆయన మాట్లాడుతూ 28న శుక్రవారం సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో సహజ యోగ ధ్యానం కార్యక్రమం ఉంటుందన్నారు. అందరికీ ఆహ్వానం పూర్తిగా ఉచితంగానే ఉంటుందని తెలిపారు. మాతాజీ నిర్మల దేవి స్థాపించిన సహజ యోగ నేడు సుమారు 170 దేశాల్లో వ్యాప్తించి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది కుల మత ప్రాంత వయసుతో సంబంధం లేకుండా సహజ యోగ సాధన చేస్తూ తాము ఎదుర్కొంటున్న శారీరక మానసిక భావోద్వేక సమస్యలను పరిష్కరించుకుంటూ ఆధ్యాత్మికతమైన సంతృప్తిని పొందుతున్నారని అన్నారు. జూన్ 26 నుంచి 30 వరకు సుమారు 500 మంది ప్రతినిధులు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు దేశాల నుంచి అతిథులు వచ్చి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ మెంబర్స్ సుప్రజ, సభ్యులు సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణం.. మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరుగా వర్షం పడింది. మరోవైపు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించి ఎల్లో అలర్టు జారీ చేసింది.

– విశ్వంభర, హైదరాబాద్

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**టీజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న**



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకి అక్రిడేషన్‌కార్డ్‌తో సంబంధం లేకుండా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి జిల్లాలోని జర్నలిస్టులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం, శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న సహకరించాలని టీజేయూ తరుపున విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీజేయూ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లేష్ నేత, టీజేయూ జిల్లా కార్యదర్శి గుర్రాల నాగరాజు, టీజేయూ మండల గౌరవ అధ్యక్షుడు జిల్లా సహాయ కార్యదర్శి నోముల రవీందర్ రెడ్డి, టీజేయూ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కంది చంద్రకళ రెడ్డి, టీజేయూ జిల్లా కార్యవర్గ సభ్యులు గొట్టిపర్తి శ్రీనివాస్, షేక్ అజీజ్, టీజేయూ మండల కార్యదర్శి మేడి శ్రీనివాస్, టీజేయూ మండల కోశాధికారి కట్టెకోల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ చామలని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, భువనగిరి :** మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ చామలతో భువనగిరి కాంగ్రెస్ నాయకులు బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్... భువనగిరి పార్లమెంట్ ఎంపీగా ఇటీవల భారీ మెజారిటీతో గెలుపొంది డిల్లీలో ప్రమాణ–స్వీకారం చేసిన్న సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని భువనగిరి కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ గురువారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటులో మంగళవారం ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా గురువారం భువనగిరి నాయకులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ శబరి అత్తిధి గృహంలో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిట్టల బాలరాజు, హీరేకార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా సత్యనారాయణ స్వామి కళ్యాణం

**విశ్వంభర, షాద్ నగర్ :** పరిగి రోడ్డు సత్యదేవ కాలనీలోని రమాసహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో ఆలయ ధర్మకర్త కట్టా లావణ్య ప్రవీణ్ కుమార్ దంపతుల సమక్షంలో గురువారం కళ్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వరుడిగా సత్యదేవుడు, వధువుగా అనంతలక్ష్మీ అమ్మవారు ముస్తాబై సిగ్గులొలికిన వేళ రమా సహిత దేవాలయం ప్రాంగణంతో పాటు, పులకరించింది. స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసి కళ్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి మండపంలో ఆశీనులను గావించారు. అనంతరం అశోక్ రెడ్డి దంపతులు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు, యువతులు, చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



# అధిక తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటాలి

**జిల్లా వ్యవసాయ అధికారి గీత**

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండలంలోని జంగారెడ్డి పల్లి గ్రామంలో పత్తి చేనును గురువారం జిల్లా వ్యవసాయ అధికారి గీత సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి వేస్తున్న మహిళా రైతులతో జిల్లా వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ.. అధికృత డీలర్ల దగ్గర అమ్మే అన్ని రకాల పత్తి విత్తనాలు మంచి దిగుబడులను అందజేస్తాయని, కృత్రిమ కొరత ఉన్న కొన్ని రకాలను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆందోళన చెందవద్దని. అధీకృత డీలర్ల దగ్గర అందుబాటులో ఉన్న విత్తనాలను ఉపయోగించుకుని అధిక దిగుబడులను పొందవచ్చని మంచి తేమ ఉన్నప్పుడే విత్తనాలు నాటుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆమనగల్లులోని అధీకృత డీలర్ల షాపులను తనిఖీ చేశారు. ఈ పాస్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారితోపాటు మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి, రైతు దుద్దు శ్రీశైలం, మహిళా రైతులు పార్వతమ్మ, జంగమ్మ, సునీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



# స్టీల్ ప్లాంట్‌పై బీజేపీ కొత్త డ్రామా

- గంగవరం పోర్టును కారుచౌకగా అమ్మేశారు
- ప్రజాశాంతి పార్టీ చీఫ్ కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, విశాఖపట్నం:** స్టీల్ ప్లాంట్ విషయంలో బీజేపీ ఎంపీలు ఢిల్లీలో బుధవారం ఆడిన డ్రామా ప్రజలు గమనించారని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ పేర్కొన్నారు. ఆయన గురువారం విశాఖలో మీడియాతో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలంటూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రికి వినతి పత్రం అందజేయడం హాస్యాస్పదం అని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తుండగా, ఆ పార్టీ ఎంపీలు ప్రధాని బదులుగా ఉక్కు శాఖ మంత్రిని కలవడం ఏంటని పాల్ ప్రశ్నించారు. గంగవరం పోర్టును కూడా గతంలో అదానికి కారుచౌకగా అమ్మేశారని ఆయన గుర్తు చేశారు. ప్రధాని మోడీ కోర్టు ఆదేశాలు పాటించాలని, ప్లాంట్ అమ్మకుండా స్టేటస్ కో ఇచ్చిందని, ఉత్తర్వులు ఇప్పుడే తనకు అందాయని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, ఎంపీ భరత్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కేఏ పాల్ ప్రశ్నించారు. ఏప్రిల్ 25న స్టీల్ ప్లాంట్ ఆస్తులు అమ్మకూడదంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రజలు ఎన్నుకున్న కూటమి ప్రభుత్వం వచ్చినా సరే స్టీల్ ప్లాంట్‌కి రక్షణ లేకుండా పోయిందని, స్టీల్ ప్లాంట్ కాపాడేందుకు వంద రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ 30 వేల మంది మహిళలు మిస్సింగ్ మీద ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని కేఏ పాల్ ప్రశ్నించారు.

# కక్షతోనే కార్యాలయాలను కూలుస్తున్నారు

**• పచ్చి విధ్వంసకారుడు చంద్రబాబు • మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫైర్**

**ఏపీ, విజయవాడ:** ఏపీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కక్షపూరితంగా వ్యవహరిస్తూ వైసీపీ కార్యాలయాలను విధ్వంసం చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గురువారం ఆయన వైసీపీ నాయకులు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజావేదికను జగన్ కూల్చారనే కక్షతో వైసీపీ కార్యాలయాలను కూలుస్తున్నారని మండిపడ్డారు. వాస్తవానికి చంద్రబాబు తీసుకొచ్చిన జీవోలతోనే వైసీపీ పార్టీ ఆఫీసుల నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. నిర్మాణాలు అక్రమమైతే నోటీసులు ఇవ్వాలని, అలా కాకుండా నేరుగా విధ్వంసాలకు పాల్పడడం అరాచకానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం చేతిలో ఉందని అరాచకాలు చేస్తే ప్రజలు సహించరని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఈవీఎంను పగులకొట్టినట్లుగా ఉన్న వీడియోను నారా లోకేష్ సృష్టించి ట్విట్టర్‌లో పెట్టారని విమర్శించారు.



వైసీపీ నేతలపై ఇంకా ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం చేశారు.

# చౌడమ్మ గుట్టపై విధ్వంసాలు సృష్టించొద్దు

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**




**విశ్వంభర, షాద్‌నగర్ :** వ్యాపార స్వప్రయోజనాల కోసం ప్రకృతిని తొలిచి, దేవాలయాన్ని కూల్చి సాధించేది ఏమీ ఉండదని "వినాశకాలే విపరీత బుద్ధి" అని వెంటనే చూడమ్మ యాడి దేవాలయ భూములను పరిరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబాయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ ఫుల్ బ్యూరో సభ్యులు మాజీ ఎమ్మెల్యే "బక్కని నరసింహులు" తదితర బీజేపీ శ్రేణులు కలిసి చౌడమ్మ యాడి, దేవాలయ స్థలాలను, గుట్ట విధ్వంసాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంత చారిత్రాత్మకమైన పురాతమైన వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇక్కడ ఉండేదని చౌడమ్మ గుట్ట హనుమాన్ దేవాలయం పక్కన ఎంతో పవిత్రమైన పుణ్యక్షేత్ర స్థలం ఉండేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గతంలో ఈ వ్యవహారంపై ఇక్కడ వెంచర్ నిర్మిస్తున్న నేపథ్యంలో నిర్వాహకులు దేవాలయాన్ని నేలమట్టం చేశారని, ప్రకృతి సహజ సంపద అయిన గుట్టలను తొలిచి ప్రకృతి సహజ సంపదను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై గతంలోనే అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ వాళ్లు గుట్టలను ధ్వంసం చేసేందుకు అనుమతి ఎలా ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ అనుమతులు ఇచ్చిన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమాజంలో దైవానికి మాత్రమే అందరూ భయపడతారని కానీ ఆ దైవాన్ని కూడా నేలమట్టం చేసి బాగుపడరని అన్నారు. దేవాలయాన్ని ఇక్కడ చారిత్రాత్మక ప్రకృతి సంపదలు నాశనం చేసిన వారికి తప్పకుండా దీని ఫలితం అనుభవిస్తారని ఇప్పటికే అనుభవిస్తున్నారని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నికలకు ముందు ఎన్నో ఆందోళనలు చేశామని కానీ వీరి ప్రవర్తనలో మార్పు రాలేదని ఇప్పుడు మళ్లీ నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య పేలుళ్లతో స్థానిక ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని శ్రీవర్ధన్ రెడ్డి అన్నారు. చౌడమ్మ యాడి దేవాలయ స్థలాలను ప్రకృతి సహజ సంపదను, ధర్మాన్ని కాపాడేందుకు బీజేపీ ఎల్లవేళలా ముందుంటుందని అన్నారు. చౌడమ్మ యాడి స్థలాల కాపాడేందుకు బిజెపి సంసిద్ధంగా ఉందని ఇందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని అనవసరంగా తమపై అబాండాలు వేయొద్దని విజ్ఞప్తి చేశారు. అధికారులు ఇక్కడ సహజ సంపదను నాశనం చేయకుండా వెంటనే బ్లాస్టింగ్లు ఆపివేయాలని లేకపోతే అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో నేత అందే బాబయ్య మాట్లాడుతూ.. ఈ ప్రాంతం ఆధ్యాత్మిక మయంమైన ప్రదేశమని ఇక్కడ చౌడమ్మ గుట్ట ఆంజనేయ స్వామితో పాటు గిరిజనుల ప్రత్యక్ష దైవం యాడి మాత ఉంటుందని అదేవిధంగా శ్రీ వెంకటేశ్వర స్వామి పురాతన దేవాలయం ఉండేదని తెలిపారు. అయితే వెంచర్ నిర్వాహకులు ఈ ఆలయాన్ని నీలమట్టం చేశారని ఇది బాధాకరమైన విషయమని అందే బాబయ్య అన్నారు. పురాతన ఆలయాలు సహజ సంపద నాశనం చేసే అధికారం వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే ఈ ప్రాంతంపై దృష్టి సారించాలని ఇక్కడ జరుగుతున్న అక్రమ పనులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, వెంకటేశ్వర్ రెడ్డి మాజీ ఎంపీపీ, చెట్ల వెంకటేష్, మఠం రిషికేష్, హరీష్ ముదిరాజ్, కొరమోని హరి భూషణ్ పటేల్, బాల్ రెడ్డి, కిరణ్ కుమార్, క్యామామహేష్, బోయ శంకర్, మల్చలం రాము, సుబ్బు, అందెల సందీప్ యాదవ్, ప్యాట వంశీ, మల్చలం రాము, మంగ విజయ్, సురేష్, రాజు,బాలారెడ్డి, కమ్మదనం శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస చారి, కాసోజు శివ, మధు తదితరులు ,బిజెపి హిందూ వాహిని ఇతర విభాగాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



# మంత్రి, ఎమ్మెల్యేలకు అభినందనలు

**విశ్వంభర, హైదరాబాద్ :** పండిత పీఈటీల చిరకాల స్వప్నం పండితులు స్కూల్ అసిస్టెంట్లుగా, పీటీలు ఫిజికల్ డైరెక్టర్లుగా నేడు పదోన్నతులు పొందిన శుభ సందర్భంగా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ మరియూ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి వెంకటరెడ్డిలకు నాగర్ కర్నూల్ జిల్లా పండిత పరిషత్ తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మంత్రి జూపల్లి చేతుల మీదుగా పదోన్నతి(స్కూల్ అసిస్టెంట్ తెలుగు) ఉత్తర్వులు పొందిన పోల సాయిజ్యోతి.



# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**విశ్వంభర, ఆమనగల్లు :** ఊర్కొండపేట గ్రామానికి చెందిన సందడి బాలమణి మరియు రామ్ రెడ్డి పల్లికి చెందిన ఎరుకలి జంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి ఇద్దరి కుటుంబ సభ్యులకు చెరో ఐదు వేల రూపాయల చొప్పున పదివేల రూపాయలను కాంగ్రెస్ నాయకుల ద్వారా వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ షైబాజ్, మాజీ వార్డు సభ్యులు కప్పెర చంద్రయ్య, లింగప్ప జంగారెడ్డి డా.రాజేశ్, మాసుం రైడర్, బాలయ్య, అజీజ్, మల్లేష్, మోహన్ రెడ్డి, జంగారెడ్డి, డ్రైవర్ లింగం తదితరులు పాల్గొన్నారు.




# ఆమనగల్లు ఎస్సైగా శ్రీనివాసులు బాధ్యతలు

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా పీ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ నుంచి ఆయన ఆమనగల్లుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బలరాం నాయక్ కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. కాగా బలరాం నాయక్ దాదాపుగా ఏడాది పాటు ఎస్సైగా విధులు నిర్వర్తించారు. సమర్థవంతంగా పనిచేసి మంచి పోలీసు అధికారిగా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు.

# నీట్ పేపర్ లీక్..

**• ఇద్దరిని అరెస్ట్ చేసిన సీబీఐ • ఇప్పటికి ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు**



**విశ్వంభర, బీహార్:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ కేసులో సీబీఐ తొలి అరెస్టులు జరిపింది. బీహార్‌లోని పాట్నాలో ఇద్దరు వ్యక్తులను సీబీఐ అధికారులు అరెస్టు చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. మే 5న నీట్ యూజీ పరీక్ష జరుగగా ముందు రోజు అభ్యర్థులకు ఒక సురక్షిత స్థావరాన్ని సమకూర్చి లీకైన ప్రశ్నాపత్రాలను, ఆన్సర్ కీస్‌ను అందచేసిన మనీష్ కుమార్, అశుతోష్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులను సీబీఐ బృందం అరెస్టు చేసినట్లు అధికారులు వివరించారు. నీట్ పేపర్ లీక్ కేసులో ఆరు ఎఫ్ఐఆర్‌లను సిబిఐ నమోదు చేసింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సులలో ప్రవేశం కోసం నీట్ యూజీ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) నిర్వహించింది. ఈ ఏడాది నీట్ పరీక్షను మే 5న 14 విదేశీ నగరాలతో సహా దేశవ్యాప్తంగా 571 నగరాలలోని 4,750 సెంటర్లలో ఎన్‌టిఏ నిర్వహించింది. 23 లక్షలకు పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఈ కేసును సిబిఐకి అప్పగిస్తున్నట్లు గత శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా మరుసటి రోజు ఆదివారం నాడు తొలి సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదైంది. నీట్ అక్రమాలపై ఆందోళన చేస్తున్న విద్యార్థులలో కొంతమంది చేసిన డిమాండు మేరకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తునకు సీబీఐ ఆదేశించింది.

# ముర్ము ప్రసంగంలో కొత్తదనం లేదు

**కొత్త సీసాలో పాత సారాలా ఉంది : అసదుద్దీన్ ఓవైసీ**



**విశ్వంభర, ఢిల్లీ:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంలో కొత్తదనం లేదని, కొత్త సీసాలో పాత సారాలా ఉందని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ పెదవివిరిచారు. ఆమె ప్రసంగం మొత్తంలో మైనారిటీల సమస్యలు, నిరుద్యోగం ఊసెత్తలేదని ఆరోపించారు.దేశంలో ప్రతిచోటా ప్రశ్నాపత్రాల లీకేజ్ జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాషాయ పాలకులు 25 లక్షల యువత జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. ఇక అంతకుముందు గురువారం ఉదయం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ఎమర్జెన్సీ రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని అన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దేశ వ్యాప్తంగా బుల్లెట్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. రాబోయే బడ్జెట్‌లో ప్రజలకు మేలు జరిగే పలు నిర్ణయాలు ఉంటాయనే సంకేతాలు పంపారు.



## ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారుల కీలకపాత్ర

**• నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి**
**• టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం**

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో నర్సింగ్ అధికారులు కీలక పాత్ర పోషిస్తారని, అనేక సమస్యలతో సతమతమౌతున్న నర్సింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవస్తానని టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరాం పేర్కొన్నారు. హైదరాబాద్, నాంపల్లి, తెలుగు యూనివర్సిటీ, ఆడిటోరియంలో గురువారం తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర సదస్సు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవి కిరణ్ పవ్వడి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శివ సాయి కృష్ణ స్వాగతం పలుకగా, ప్రొ. కోదండరాం ముఖ్యఅతిథిగా, ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్నగౌడ్, సంఘం సలహాదారు బి.వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక అథితులుగా పాల్గొన్నారు. ఈ సదస్సునుద్దేశించి ప్రొ. కోదండరాం మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నర్సింగ్ అధికారుల సమస్యల పట్ల ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని నర్సింగ్ ఉద్యోగుల బదిలీలలో స్థానికత పాటించలేదని, డీఏ, పిఆర్సి పెంపును పట్టించుకోలేదని, ఆసుపత్రులలో కనీసం నర్సింగ్ ఉద్యోగులకు దుస్తులు మార్చుకునే గది, తాగు నీరు, వాష్‌రూమ్‌లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నర్సింగ్ అధికారులు ఎదుర్కుంటున్న అన్ని సమస్యలను ముఖ్యంగా జి.ఓ.నెంబర్ 317 ద్వారా స్థానికత కోల్పోయిన నర్సింగ్ ఉద్యోగులకు న్యాయం మరియు జాతీయ వైద్య మండలి నిబంధనల మేరకు ప్రతి 100 పడకల ఆసుపత్రిలో 5 మంది హెడ్ నర్సుల నియామకానికి సంబంధించి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానని ప్రొ. కోదండరాం హామీ ఇచ్చారు. వై. నాగన్న గౌడ్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఒక కళ మరియు సైన్స్ అలాగే మానవతా సేవ అని, అనారోగ్యం నుండి కోలుకోవడానికి మరియు సరైన ఆరోగ్యం, జీవన నాణ్యతను నిర్వహించడానికి ప్రజలకు సహాయపడుతుందని తెలిపారు. అవసరమైన వైద్య సేవలను అందించే ఆరోగ్య సంరక్షణ అధికారుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడివుందన్నారు. రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి "ఆరోగ్యకరమైన తెలంగాణ" నిర్మాణంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 7,000 మంది నర్సింగ్ అధికారులను నియమించిందని గుర్తు చేసారు. సంఘం ఐక్యతతో ఉంటేనే హక్కులు సాదించబడుతాయని, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలైన నర్సింగ్ అధికారులు సమస్యలపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ను కలసి పరిష్కరానికి కృషి చేస్తానని వై. నాగన్న గౌడ్ చెప్పారు. ఈ సదస్సులో తెలంగాణ నర్సింగ్ అధికారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. కవిత, ఉపాధ్యక్షులు ఎస్. సుజీవన్, కె. విజయేశ్కాంత్, ఈ. స్వాతి, సహాయ కార్యదర్శులు ఎండి. సలావుద్దీన్, కె. రామ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిలు నరేంద్ర రాజన్, కె. వినోద్, కోశాధికారి జి. నరేష్, నేతలు రాజేందర్ రెడ్డి, నంద కుమార్, మొగిరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో సుస్థిర అభివృద్ధి

**• ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతం**
**• ఆరోగ్య రంగంలో అగ్రగామి**
**• ప్రజా సంక్షేమం కోసం సంస్కరణలు**
**• ఎమర్జెన్సీ రాజ్యాంగంపై దాడి**
**• పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు**
**• రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**



**విశ్వంభర, న్యూఢిల్లీ :** ప్రభుత్వం చేపట్టే నియామకాలు, పరీక్షల్లో పవిత్రత ఉండాలని, పారదర్శకంగా జరగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. నాలుగో రోజు గురువారం పార్లమెంట్ సమావేశాలు రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. కొత్తగా కొలువు దీరిన 18వ లోక్‌సభతో పాటు రాజ్యసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. మూడోసారి అధికారాన్ని చేపట్టిన మోడీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్ చేరుకున్న రాష్ట్రపతికి గజ ద్వారం వద్ద ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్వాగతం పలికారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని ముర్ము చెప్పారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం అయ్యిందని, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తోందని ప్రభుత్వ విధానాలను ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు రాష్ట్రపతి చెప్పారు. ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతంగా ఉన్నట్లు తెలిపారు. అన్నిరంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయని హరిత ఇంధనం సాధన దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్రపతి తెలిపారు. ఇటీవల నీట్ యూజీ నెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై స్పందించారు. ప్రభుత్వం చేపట్టే నియామకాలు పరీక్షల్లో పవిత్రత ఉండాలి. పారదర్శకంగా జరగాలి. పేపర్ లీక్‌లు పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో ఉన్నత స్థాయిలో విచారణ జరుగుతోంది. ఇలాంటి ఘటనల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరముంది. నీట్ తదితర పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికల ప్రక్రియను విజ యవంతంగా నిర్వహించిన భారత ఎన్నికల సంఘానికి అభినందనలు. ఈ ఎన్నికల్లో ప్రజలు సుస్థిరతకు పట్టం కట్టారు. ప్రజలు నిజాయతీని నమ్మి ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి మీరంతా సభకు వచ్చారు. ప్రజా స్వామ్య పరిరక్షణలో సభ్యులు విజయవంతమవుతారని ఆశిస్తున్నా. దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలి. ప్రభుత్వం పదేళ్లో సుస్థిర అభివృద్ధిని సాధించింది. జమ్మూకశ్మీర్‌పై శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారు. కానీఈ సారి కశ్మీర్ లోయలో మార్పు కన్పించింది. శుత్రువులకు గట్టిగా బదులిస్తూ జమ్మూకశ్మీర్ ప్రజలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని రాష్ట్రపతి అన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరిగినట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ప్రపంచ వ్యాప్త డిమాండ్ మేరకు భారత్ ఉత్పత్తులు అందిస్తోందన్నారు. ఆరోగ్య రంగంలో భారత్ అగ్రగామిగా ఉందని వేగంగా పురోగతి సాధిస్తోందన్నారు. చిన్నసన్నకారు రైతులకు ఆర్థిక భరోసా కోసం పీఎం సమ్మాన్ నిధి ద్వారా నేరుగా వారి ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రోడ్ల విస్తరణ వేగంగా జరుగుతున్నుల చెప్పారు. పౌర విమానయాన రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చామని ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయా రాష్ట్రాల మధ్య కనెక్టివిటి పెరిగినట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడించారు.

డిజిటల్ ఇండియా సాధనకు తమ ప్రభుత్వం సంకల్పించినట్లు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తెలిపారు. బ్యాంకుల క్రెడిట్ బేస్ పెంచి వాటిని బలోపేతం చేశారు. డిజిటల్ లావాదేవీలు భారీగా పెరిగాయి. సైనిక దళాల్లో స్థిరమైన సంస్కరణల కారణంగా బలగాలు స్వయం సమృద్ధి సాధించాయి. రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయటం సైనికులకు ఒకే ర్యాంకు ఒకే పింఛను అమలు చేశారని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిని ఇబ్బంది పెట్టేలా.. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ అంశాన్ని ద్రౌపది ముర్ము ప్రస్తావించారు. అదే సమయంలో రాజ్యాంగాన్ని బీజేపీ మార్చివేస్తుందన్న ప్రతిపక్షాల విమర్శలకు సైతం మోడీ ప్రభుత్వం రాష్ట్రపతి ప్రసంగంలో కౌంటర్ ఇచ్చేందుకు ప్రయత్నించింది. దేశ రాజ్యాంగం గడిచిన దశాబ్దాల్లో అనేక సవాళ్లను పరీక్షలను తట్టుకుని నిలబడింది. రాజ్యాంగం అమ్లలోకి వచ్చిన తర్వాత దానిపై అనేక సార్లు దాడులు జరిగాయి. 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ రాజ్యాంగంపై నేరుగా జరిగిన దాడిలో అతిపెద్ద చీకటి అధ్యాయం. యావత్ దేశం ఘోర అవమానంగా భావించింది. భారతదేశ మూల స్వభావంలోనే గణతంత్ర సంప్రదాయాలు ఉండటంతో అటువంటి రాజ్యాంగ వ్యతిరేక శక్తులపై దేశం విజయం సాధించింది అని ముర్ము చెప్పారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం ఒక పాలనాపరమైన మాధ్యమంగా చూడటం లేదని ప్రజా చైతన్యంలో దాన్ని ఒక భాగం చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నదని రాష్ట్రపతి ముర్ము వెల్లడించారు.



# కేరళలో భారీ వర్షాలు


## పాఠశాలలకు సెలవులు

**విశ్వంభర, కేరళ :** కేరళను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నేపధ్యంలో వాతావరణశాఖ పలు హెచ్చరికలు, సూచనలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు కేరళ మీదుగా మరికొన్ని రోజులు కొనసాగనున్నాయని తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. మహారాష్ట్ర-కేరళ తీరాల వెంబడి సముద్ర మట్టంలో ద్రోణి ఏర్పడిందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. మధ్య గుజరాత్ పరిసర ప్రాంతాలలోనూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. కేరళ తీరంలో గంటకు 35 కిలోమీటర్ల నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.
వాతావరణశాఖ హెచ్చరికల నేపధ్యంలో కేరళలోని ఆరు జిల్లాల్లో పాఠశా లలను మూసివేశారు. పతనంతిట్ట, కొట్టాయం, అలప్పుజ, ఇడుక్కి, ఎర్నాకుళం, వయనాడ్‌లలో గత రెండు రోజులు గా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి.

# ఈ నెల 29 నుంచి అమర్‌నాథ్ యాత్ర షురూ



**విశ్వంభర, జమ్మూ:** అమర్‌నాథ్ యాత్ర ఈ నెల 29న మొదలవనున్నది. యాత్రకు ముందురోజు అంటే శుక్రవారం మొదటి బ్యాచ్ బేస్ క్యాంప్ భగవతినగర్ జమ్మూ నుంచి బల్తాల్, పహల్గామ్ బయలుదేరి వెళ్లనున్నాయి. ఈ క్రమంలో బుధవారం జమ్మూలోని సరస్వతి ధామ్‌లో ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ల జారీ మొదలైంది. తొలిరోజు బల్తాల్, పహల్గాం నుంచి వెళ్లేందుకు సుమారు 1000 టోకెన్లు జారీ చేశారు. యాత్రికులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు జనం భారీగా తరలివచారు. సరస్వతి ధామ్‌కు తెల్లవారుజామున 4 గంటల నుంచి యాత్రికులు చేరుకొని.. క్యూలైన్లలో బారులు తీరారు. బంగ్లాదేశ్ నుంచి సైతం నలుగురు భక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని జమ్మూకు చేరుకున్నారు. భద్రతలో ఎలాంటి లోపం లేకుండా చూసేందుకు భద్రతా బలగాలు మార్క్ డ్రిల్ నిర్వహించి, ఏర్పాట్లను పరిశీలించాయి. ఇటీవల ప్రయాణికుల వాహనంపై ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భద్రతా బలగాలను భారీగా మోహరించారు. డ్రోన్లు, 365 డిగ్రీస్ యాంగిల్ సీసీ కెమెరాల సాయంతో వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. జమ్మూ-శ్రీనగర్ హైవేపై ప్రతి 500 మీటర్లు, కిలోమీటరుకు సెక్యూరిటీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ 24 గంటలూ సాయుధ సైనికులను మోహరించి తనిఖీలు చేయనున్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే వారంతా సాయంత్రం 7గంట ల్లోగా భగవతినగర్‌లోని బేస్ క్యాంప్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. యాత్ర కోసం రిజిస్ట్రే షన్ చేసుకున్న వారంతా ఇప్పటికే జమ్మూకు తరలివస్తున్నారు.



## ఆస్పత్రి నుంచి అద్వానీ డిశ్చార్జి

**విశ్వంభర, ఢిల్లీ :** బీజేపీ జాతీయ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కే.అద్వానీ (96) అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి ట్రీట్‌మెంట్ అందించారు. గురువారం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో నుంచి ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఎయిమ్స్ యూరాలజీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఆయనకు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జి చేశారు. ఈ విషయాన్ని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి. కాగా అద్వానీ ఆరోగ్యం క్షీణించిందన్న వార్తలతో ఆయన అభిమానులు బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాయి. ఆయన త్వరగా కోలుకోవాలని పలువురు ప్రార్థనలు చేశారు. దేశంలో అపర చాణక్యుడు మాజీ ఉప ప్రధాని అనారోగ్యానికి గురయ్యారని పలువురు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. అలాగే పలువురు బీజేపీ జాతీయ రాష్ట్రాల నేతలు కూడా అధ్వాని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.




## రష్యాలో ఘోర రైలు ప్రమాదం

**• పట్టాలు తప్పిన ప్యాసింజర్ రైలు**
**• 70 మందికి తీవ్ర గాయాలు**

**విశ్వంభర, కోమి రిపబ్లిక్:** రష్యాలో రైలు ప్రమాదం చోటు చేసుకుంది. ఫార్ నార్త్‌లో ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పి నదిలో పడిపోయింది. ఈ ఘటనలో సుమారు 70 మంది ప్రయాణికులు గాయపడ్డారు. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. రైలు వోర్కుటా నగరం నుంచి ఆర్కిటిక్ సర్కిల్ మీదుగా.. దేశంలోని దక్షిణాన నల్ల సముద్రంలోని నోవోరోసిస్క్ నౌకాశ్రయానికి వెళ్తోంది. కోమి రిపబ్లిక్‌లోని ఇంటా అనే చిన్న పట్టణం సమీపంలోకి రాగానే రైలు పట్టాలు తప్పింది. దింతో తొమ్మిది బోగీలు కోమి నదిలోకి పడిపోయాయి. ఆ సమయంలో ట్రైన్‌లో 215 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 70 మంది గాయపడినట్లు తెలిసింది. క్షతగాత్రుల్లో ఏడుగురికి తీవ్రమైన గాయాలైనట్లు స్థానిక మీడియా నివేదించింది. ప్రమాద సమయంలో నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని పేర్కొంది. రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

# పోలీసులు రాజకీయాల జోలికి వెళ్లొద్దు

- రాజకీయాలు చేసేట్టయితే ఖద్దరు చొక్కా వేసుకోండి
- స్నేహపూర్వక పోలీసింగ్ విధానం కావాలి
- గత ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం
- హోంమంత్రి వంగలపూడి అనిత వార్నింగ్



**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం విశాఖపట్నంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. పోలీసులు రాజకీయాల జోలికి వెళ్లొద్దు అని స్పష్టం చేశారు. పోలీసులూ... మీ పని మీరు చేయండి... ఖాకీ చొక్కాలు వేసుకుని రాజకీయాలు చేయొద్దు అని హెచ్చరించారు. ఖాకీ చొక్కా వేసుకుని రాజకీయాలు చేసేట్టయితే ఖద్దరు చొక్కా వేసుకోండి అని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో స్నేహపూర్వక పోలీసింగ్ విధానం అమలు కావాలని, ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా వ్యవహరించాలని సూచించారు. గత ఐదేళ్లుగా పోలీసులు అంటే ఒక విధమైన ముద్ర పడిపోయిందని విచారం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల వారిని ఇబ్బంది పెట్టేందుకో, వాళ్ల ఇళ్ల వద్ద కాపు కాయడానికో, ప్రతిపక్షాల వారిని అరెస్ట్ చేయడానికో, ప్రతిపక్షాల వారిని భయాందోళనలకు గురి చేయడానికో తప్ప వేరే పనులకు ఉపయోగించని పరిస్థితి కనిపించిందని అనిత వివరించారు. కానీ ఇప్పుడు అలా జరిగే పరిస్థితి లేదని, కచ్చితంగా పోలీస్ డిపార్ట్ మెంట్ లో సంస్కరణలు తీసుకువస్తామని చెప్పారు. డిపార్ట్ మెంట్ హ్యాపీగా ఉండాలి, ప్రజలు హ్యాపీగా ఉండాలి... ఈ రెండింటి మధ్య సమతూకం సాధిస్తూ ముందుకు వెళతామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క పోలీస్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని, తాము పోలీస్ రిక్రూట్ మెంట్ కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోషల్ మీడియాలో మహిళలపై దుష్ప్రచారాలు చేసేవారిపై కఠినచర్యలు ఉంటాయని, తాను కూడా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టుల బాధితురాలినేనని తెలిపారు. కాగా, గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా అనేక ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టులో ఉన్నాయని, ఇప్పుడు తాను మాట్లాడుతున్న సీపీ కార్యాలయం కూడా తాకట్టులో ఉందో, లేదో చూడాలని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో ఇప్పటికీ ఒక పోలీస్ స్టేషన్ రేకుల షెడ్డులోనే నడుస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కేంద్రం నుంచి నిధులు వచ్చినప్పటికీ సద్వినియోగం చేయలేదని విమర్శించారు.

# సీఎస్ నీరభ్ పదవీకాలం పొడిగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- డిసెంబర్31 వరకు సర్వీసు పొడిగింపు



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు డీవోపీటీ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 1వ తేదీ నుంచి డిసెంబర్ 31 వ తేదీ వరకు ఆయన సర్వీసును పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జవహర్‌రెడ్డిని బదిలీ చేసి నీరభ్‌కుమార్‌ను సీఎస్‌గా నియమించారు. 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన.. సీఎస్ కావడానికి ముందు రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశా రు. 1988లో పశ్చిమ గోదావరి జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా తన ప్రయాణాన్ని నీరభ్‌కు మార్ మొదలుపెట్టారు. 1990లో తూర్పు గోదావరి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. 1991లో ఏటూరు నాగారం పీవో ఐటీడీఏ, 1992లో కృష్ణా జిల్లా పీడీ ఆర్డీఏగా పనిచేశారు. 1993లో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, 1996లో ఖమ్మం కలెక్టర్‌గా, 1998లో చిత్తూరు కలెక్టర్‌గా సేవలు అందించారు. 1999లో యువజన సంక్షేమశాఖ డైరెక్టర్, శాప్ ఎండీగా పనిచేశారు. 2000లో కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం ఏపీ సీఎస్‌గా కొనసాగుతున్నారు.



# నెల్లూరు సెంట్రల్ జైలుకు పిన్నెల్లి

**భారీ బందోబస్తు నడుమ జైలుకు తరలింపు**

**విశ్వంభర, నెల్లూరు :** ఈవీఎం ధ్వంసం కేసుతో పాటు మరికొన్ని కేసుల్లో అరెస్ట్ అయిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తాజాగా నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. పిన్నెల్లి పెట్టుకున్న నాలుగు బెయిలు పిటిషన్లను బుధవారం హైకోర్టు కొట్టివేసిన వెంటనే పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి ఎస్పీ కార్యాలయానికి తరలించారు. రాత్రి పది గంటల సమయంలో మాచర్ల కోర్టుకు తరలించారు. 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో తాజాగా, భారీ భద్రత మధ్య నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. జైలుకు వెళ్లే మార్గంతోపాటు జైలు బయట పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన మే 13న రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలోకి దూసుకెళ్లిన పిన్నెల్లి ఈవీఎంను ఎత్తి నేలకేసి కొట్టి విధ్వంసం సృష్టించారు. లోపల ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేసిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడిచేశారు. పోలింగ్ కేంద్రం బయట చెరుకూరి నాగశిరోమణి అనే మహిళ నిలదీయడంతో ఆమెను హెచ్చరించి దుర్భాషలాడారు. ఈ ఘటనలపై కేసు నమోదు కాగా, తొలుత ఆయన పరారయ్యారు. ఆ తర్వాత కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడంతో తిరిగి మాచర్ల చేరుకున్నారు. ఆయనపై నమోదైన నాలుగు కేసుల్లో బెయిలుకు దరఖాస్తు చేసుకోగా హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయనను అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వర్మ, ఇక్బాల్?

- ఆ ఇద్దరి పేర్లను కన్ఫామ్ చేసిన టీడీపీ అధిష్టానం
- కూటమి గెలుపులో వర్మ, ఇక్బాల్‌ది కీలక పాత్ర
- త్వరలోనే అధికారికంగా ప్రకటించే ఛాన్స్
- జులై 12న ఎమ్మెల్సీ ఎన్నిక
- నామినేషన్ల దాఖలకు గడువు జులై 2





**విశ్వంభర, విజయవాడ :** రాష్ట్రంలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల కనుక రెండు స్థానాలు టీడీపీకే వస్తాయి. ఈ రెండు స్థానాలను భర్తీ చేయడానికి టీడీపీ కసరత్తు చేసింది. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కాకినాడ జిల్లా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ పేర్లు ఖరారు చేసినట్లు తెలిసింది.

**ఈ ఇద్దరికి ఇవ్వాలని అధిష్టానం మొగ్గు**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ తన అభ్యర్థులుగా ఎస్‌వీఎస్ఎన్ వర్మ, మహ్మద్ ఇక్బాల్ పేర్లను ఖరారు చేయడానికి సిద్ధపడింది. వర్మ పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే. 2014 ఎన్నికల్లో టీడీపీ పిఠాపురం ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వకపోతే, ఇండిపెండెంట్‌గా పోటీ చేసి 47,080 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పీవి విశ్వంకి కేవలం 15,187 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ తనను మోసం చేసిందని, టీడీపీ జెండాలు దగ్ధం చేసి కన్నీరు పెట్టుకుని వర్మ ప్రచారం చేశారు. సానుభూతి అద్భుతంగా పనిచేసి భారీ మెజార్టీతోనే గెలిచారు. అనంతరం మూడు రోజులకే టీడీపీలో చేరారు. ఆయన వ్యవహరించిన తీరుతో ఉద్యోగులు, ప్రజలు విసుగు చెంది 2019లో ఓడించారు. అప్పుడు టీడీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. ఓడిపోయినప్పటికీ నియోజకవర్గాన్ని విడిచిపెట్టకుండా, ఐదేళ్ల పాటు ప్రజల కోసం పని చేసి, మంచి ఆదరణ పొందారు. అయితే ఎన్నికలు వచ్చే సరికి టీడీపీ, జనసేన పొత్తుల్లో భాగంగా పిఠాపురం జనసేనకు కేటాయించారు. జనసేన తరపున ఆపార్టీ అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తానని ప్రకటించారు. దీంతో వర్మ, ఆయన అనుచరుల్లో అసంతృప్తి రగిలింది. టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌పై దుమ్మెత్తి పోశారు. రాయడానికి వీలు లేని తిట్ల మోత మోగించారు. దీంతో వర్మను చంద్రబాబు విజయవాడకు పిలిపించి, ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ వర్మ, ఆయన అనుచరుల్లో సంతృప్తినిచ్చింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగానే ఇప్పుడు ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేశారు. యనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేశారు. ఇక అనంతపురానికి చెందిన మహ్మద్ ఇక్బాల్ 2027 మార్చి 29 వరకు ఎమ్మెల్సీ పదవీ కాలం ఉన్నప్పటికీ, ఎన్నికల ముందు వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, టీడీపీలో చేరారు. ఎన్నికల్లో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ గెలుపు కోసం ఇక్బాల్ శ్రమించారు. అలాగే ఇక్బాల్ పార్టీలో చేరినప్పుడు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఇప్పుడు ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు సమాచారం.

**జులై 12న ఎమ్మెల్సీ ఎన్నిక**

ఎమ్మెల్సీ నామినేషన్ల దాఖలకు గడువు జులై 2తో ముగుస్తుంది. జులై 3న నామినేషన్లు పరిశీలిస్తారు. జులై 5 నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. జులై 12న ఎన్నిక జరుగుతుంది. అయితే ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే సంఖ్య బలం చూస్తే రెండు స్థానాలు టీడీపీకే దక్కుతాయి. అందువల్ల ఎన్నిక జరగకపోవచ్చు. దాదాపు ఏకగ్రీవమే అవుతాయి.

# ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటు

- జగన్ ఏనాడుఅసెంబ్లీ నియమాలను పాటించలే
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శలు



**విశ్వంభర, విజయవాడ:** వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గు చేటు అని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు. జగన్ ఏనాడు కూడా అసెంబ్లీ నియమాలను పాటించలేదని ఆరోపించారు. గ్రామాల్లో కూడా జగన్ పరదాలు కట్టుకుని తిరగారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేయడం ప్రారంభమైందని తెలిపారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 65 లక్షల పేద కుటుంబాలకు మేలు జరిగేలా సంక్షేమాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. జూలై 1వ తేదీ నుంచి పింఛన్లు ఇస్తామని తెలిపారు. పింఛన్ల విషయంలో పేదలను వైసీపీ మోసం చేసిందని ఆరోపించారు. రూ. 3వేల పింఛన్ ఇస్తామని చెప్పి.. ఐదేళ్ల పాలన చివరలో ఇచ్చారని గుర్తు చేశారు. 4 వేలకు పెన్షన్ పెంచుతామని చెప్పిన చంద్రబాబు.. మొదటి నెల నుంచే అమలు చేస్తుందని తెలిపారు. మూడు నెలల బకాయి డబ్బులను కూడా వేస్తామని చెప్పారు. ప్రభుత్వ రంగ గుర్తింపు పొందిన సచివాలయ ఉద్యోగుల ద్వారానే పెన్షన్లు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. గతంలో రూ. 2700 కోట్ల నిధులను పెన్షన్ల కోసం వెచ్చిస్తుండగా.. ఇప్పుడు రూ. 4400 కోట్ల మేర పెన్షన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. డీఎస్సీకి గత ప్రభుత్వం నీళ్లొదిలిందని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోగా మెగా డీఎస్సీ పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ విజయవంతంగా అమలు జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# పవన్ కార్యాలయంలో సీఐ అత్యుత్సాహం

**శ్రీనివాసరావుపై బదిలీ వేటు**

**విశ్వంభర, అమరావతి:** మంగళగిరిలోని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయంలో భద్రతా సిబ్బందితో సీఐ శ్రీనివాసరావు దురుసుగా ప్రవర్తించారు. బుధవారం పవన్ కల్యాణ్ ఉన్న సమయంలోనే అనుమతి లేకుండా ఆఫీసులోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారాహి దీక్షలో ఉన్న పవన్ కల్యాణ్ అమ్మవారికి పూజలు చేస్తున్న సమయంలోనే ఆయన లోపలికి వెళ్లేందుకు ట్రై చేశారు. దీంతో కొద్దిసేపు వెయిట్ చేయమని చెప్పిన భద్రతా సిబ్బందిపై సీరియస్ అయ్యారు. వాళ్ల మాటలు పట్టించుకోకుండా బూటు కాళ్లతోనే లోపలికి వెళ్లారు. మంగళగిరి టౌన్ సీఐ శ్రీనివాసరావు దురుసు ప్రవర్తనపై డిప్యూటీ కార్యాలయ సిబ్బంది పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు శ్రీనివాసరావుపై బదిలీ వేటు వేశారు. ఆయన స్థానంలో త్రిపురాంతకం సీఐ వినోద్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. సీఐ శ్రీనివాసరావు గతంలో కూడా జనసేన నాయకులతో ఇలాగే దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల సమయంలో జనసేన పార్టీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఉండే అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి తనిఖీల పేరుతో హడావుడి చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి.

# ఏపీ ఎడ్ సెట్ ఫలితాలు విడుదల



**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో 2024-25 విద్యా సంవత్సరానికి బీఈడీ, బీఈడీ (స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎడ్‌సెట్)ఎగ్జామ్స్ గతంలో నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం విడుదలయ్యాయి. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఈ మేరకు ఫలితాలను విడుదల చేసింది. పరీక్ష రాసిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే ఈ ఏడాది ఎడ్ సెట్ ను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించిన సంగతి తెలిసిందే. జూన్ 8వ తేదీన ఎడ్‌సెట్ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జరిగింది. ఈ ఫలితాల్లో వచ్చిన ర్యాంకు ఆధారంగానే కాలేజీల్లో సీట్లు కేటాయిస్తారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ శుభవార్త

## ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు పొడిగింపు




**విశ్వంభర, అమరావతి :** ప్రభుత్వ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్ర స్థాయి ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని విధానం మరికొంతకాలం పాటు కొనసాగించాలని నిర్ణయించింది. సెక్రటేరియట్, హెచ్ఓడీలలో పని చేసే ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు పొడిగింపునకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. వాస్తవానికి ఐదు రోజుల వర్కింగ్ డేస్ విధానం నేటితో ముగిసిపోతుంది. సచివాలయం ఉద్యోగుల సంఘం వినతితో గడువు పొడిగింపునకు సీఎం అంగీకారం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడనున్నాయి. తమ విజ్ఞప్తిని పరిశీలించి మరొక సంవత్సరం పాటు వారానికి ఐదు రోజుల పనిని కొనసాగించే ప్రతిపాదనకు ఓకే చెప్పినందకు సీఎంకు ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం ధన్యవాదాలు తెలిపింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఆంధ్రప్రదేశ్ సచివాలయాన్ని అమరావతికి తరలించిన నేపథ్యంలో ఏపీ సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల ఉద్యోగులు వారాంతంలో హైదరాబాద్‌కు వచ్చి పోయేందుకు వీలుగా వారానికి ఐదు రోజుల పనివిధానాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిపిందే. అంటే సోమవారం నుంచి శుక్రవారం వరకూ మాత్రమే వీరు పనిచేసేలా వెసులుబాటు ఇచ్చారు. ఆ తర్వాత వైసీపీ సర్కార్ ఈ విధానాన్ని కొన సాగించింది. ఆ గడువు నేటితో ముగిసిపోతున్న నేపథ్యం లో తాజాగా ప్రభుత్వం ఈ విధానాన్ని కొనసాగించేందుకు అంగీకారం తెలిపింది.

# ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

## అఫ్ఘానిస్థాన్‌పై ఘన విజయం

## 56 పరుగులకే అఫ్ఘాన్ ఆలౌట్



**విశ్వంభర, స్పోర్ట్స్:** దక్షిణాఫ్రికా జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. టీ20 వరల్డ్ కప్-2024 ఫైనల్స్‌కు దక్షిణాఫ్రికా అర్హత సాధించింది. ట్రినిడాడ్ వేదికగా అఫ్ఘానిస్థాన్‌తో ఏకపక్షంగా సాగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ప్రపంచకప్ చరిత్ర లో సౌతాఫ్రికా తుదిపోరుకు చేరడం ఇదే తొలిసారి. గత వన్డే, టీ20 వరల్డ్ కప్‌ల్లో ఒక్కసారి కూడా సఫారీ సేన టైటిల్ పోరు వరకు చేరుకోలేదు. మందకొడి పిచ్‌పై మొదట బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ 11.5 ఓవర్లలో 56 పరుగులకే ఆలౌటైంది. దక్షిణా ఫ్రికా బౌలర్ల ధాటికి అఫ్ఘాన్ బ్యాటర్లు వణికిపోయారు. వరల్డ్ కప్ సెమీఫైనల్ చరిత్రలోనే అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా అఫ్ఘాన్ అపకీర్తి మూటగట్టుకుంది. అజ్మతుల్లా ఒమర్జా య్ (10బీ 12 బంతుల్లో, 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు ను అందుకున్నాడు. అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌లో ఎక్స్‌ట్రా రూపంలో వచ్చిన 13 పరుగులే అత్యధిక స్కోరు కావడం గమనార్హం. అఫ్ఘాన్ 28 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన స్థితిలో బ్యాటింగ్‌కు వచ్చిన రషీద్ ఖాన్ (8బీ 8 బంతుల్లో, 2 ఫోర్లు), కరీమ్ జనత్ (8బీ 13 బంతుల్లో, 1 ఫోర్) ఏడో వికెట్‌కు 22 పరుగులు జోడించడంతో 50 పరుగులను దాటిం ది. లేదంటే ఆ మాత్రం స్కోరు కూడా సాధించలేక పోయేది. సౌతాఫ్రికా బౌ లర్లలో మార్కో జేన్సన్ (3/16), షంసీ (3/6) చెరో మూడు వికెట్లతో విజృంభించారు. రబాడ (2/14), నోకియా (2/7) తలో రెండు వికెట్లతో సత్తాచాటారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 8.5 ఓవర్లలో ఒక్క వికెట్ కోల్పోయి విజయం సాధించింది. ఆదిలోనే డికాక్ (5బీ 8 బంతుల్లో, 1 ఫోర్) ఔటైనా రీజా హెండ్రిక్స్ (29 నాటౌట్‌బీ 25 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్సర్), మార్క్‌రమ్ (23 నాటౌట్‌బీ 21 బంతుల్లో, 4 ఫోర్లు) జట్టును విజయతీరాలకు చేర్చారు. ఛేదన ప్రారంభంలో అఫ్ఘాన్ సఫారీలకు సవాల్ విసిరింది. డికాక్‌ను ఫజల్లా ఔట్ చేయడం, నవీనుల్ నిప్పులు చెరిగే బంతులు విసరడంతో సౌతాఫ్రికా 3 ఓవర్లకు 6/1 స్కోరుతో నిలిచింది. కానీ ఆ తర్వాత అఫ్ఘాన్ రివ్యూకు వెళ్లకపోవడంతో బతికిపోయిన మార్క్‌రమ్ జోరు పెంచాడు. హెండ్రిక్స్‌తో కలిసి లక్ష్యాన్ని క్రమంగా కరిగించాడు. దీంతో పవర్‌ప్లేలో సౌతాఫ్రికా 36/1తో నిలిచింది. ఆ తర్వాత విజయాన్ని అందుకోవడానికి దక్షిణాఫ్రికాకు ఎక్కువ సమయం పట్టలేదు. అజ్మతుల్లా వేసిన తొమ్మిదో ఓవర్ అయిదో బంతికి హెండ్రిక్స్ బౌండరీ సాధించి జట్టును గెలిపించాడు.

## నా కంటే ఆ ప్లేయర్ 1000 రెట్లు బెటర్

### టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసల జల్లు కురిపించాడు. బుమ్రా తన కంటే ఎంతో ఉత్తమమైన బౌలర్ అని కపిల్ దేవ్ కొనియాడాడు. టీ20 ప్రపంచకప్ 2024లో జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ ప్రదర్శన కనబరుస్తున్న విషయం తెలిసిందే. సంచలన బౌలింగ్‌తో టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. వరుస విజయాలతో టీమిండియా సెమీఫైనల్‌కు దూసుకెళ్తింది. గయానా వేదికగా జరిగే సెమీఫైనల్-2లో ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో ఓ ఛానెల్‌తో మాట్లాడిన కపిల్ దేవ్.. బుమ్రాతో పాటు టీమిండియా ప్రదర్శనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్ 2024లో బుమ్రా ప్రదర్శనను చూస్తుంటే తనకు ముచ్చటేస్తుందని కపిల్ దేవ్ అన్నాడు. వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లపై బుమ్రా పూర్తి ఆధిపత్యం చెలాయిస్తున్నాడని అభినందించాడు. 'జస్‌ప్రీత్ బుమ్రా నాకంటే వెయ్యి రెట్లు అద్భుతమైన బౌలర్. ఈతరం క్రికెటర్లలో చాలా మంది మంచి నైపుణ్యం కలిగిన వారే. ప్రస్తుత టీమిండియాలో చాలా మంది నాణ్యమైన క్రికెట్ ఆడటంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో చాలా ముందున్నారు. జట్టు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇలాగే కొనసాగితే గొప్ప క్రికెటర్లుగా కావడం పెద్ద కష్టమేం కాదు.'అని కపిల్ దేవ్ చెప్పుకొచ్చాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీలను పోల్చలేమని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు. ఫిట్‌నెస్ పరంగా కోహ్లీ అంత బలంగా లేకపోయినా.. ప్రత్యర్థి బౌలర్లను రోహిత్ అలవోకగా ఆడుతున్నాడని కపిల్ దేవ్ కితాబిచ్చాడు.'కోహ్లీ ఫిట్‌నెస్ ఫ్రీక్. జిమ్‌లో వర్కౌట్లు చేయడానికి చాలా ఇష్టపడుతాడు. వాస్తవానికి, అతని వల్ల సహచర ఆటగాళ్లలోనూ చాలా మార్పు వచ్చింది. రోహిత్ శర్మ మాత్రం జిమ్ అంటే పెద్దగా ఇష్టపడడు. అలాగని ఫిట్‌నెస్ లేదని కాదు. సులువుగా షాట్స్ ఆడగలడు. తాజా టీ20 ప్రపంచకప్‌లో కోహ్లీ విఫలమైనా.. రోహిత్ అద్భుతంగా రాణించాడు. కోహ్లీ 150, 200 కేజీల బరువులు సులువుగా ఎత్తగలడు. అలాగని రోహిత్ శర్మ కూడా ఎత్తాలని లేదు. ఎవరి ఫిట్‌నెస్, ఎవరి ఆట వారిది. ఈ ఇద్దరిని పోల్చాల్సిన అవసరం లేదు.'అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు.

## అప్పుడప్పుడూ కాస్త బుర్ర వాడండి

### పాక్ మాజీ ప్లేయర్‌కు రోహిత్ రిప్లై



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 వరల్డ్ కప్ 2024 టోర్నీలో భారత జట్టు అజేయంగా సెమీ ఫైనల్ చేరింది. భారత బ్యాటర్ల నుంచి అదిరిపోయే పర్ఫామెన్స్ రాకపోయినా బౌలర్లు అదరగొడుతున్నారు. అర్ష్‌దీప్ సింగ్ 6 మ్యాచుల్లో 15 వికెట్లు తీసి, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో రెండో స్థానంలో ఉన్నాడు. జస్ప్రిత్ బుమ్రా 11 వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ సింగ్ ఇన్ స్వింగ్ బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టిస్తున్నాడు. పాకిస్తాన్ బౌలర్లు ఫెయిల్ అయిన చోట, భారత బౌలర్లు అదరగొడుతుండడం చూసి పాక్ మాజీ క్రికెటర్లు ఓర్వలేకపోతున్నారు. పాక్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్, అర్ష్‌దీప్ సింగ్ బాల్ ట్యాంపరింగ్ చేస్తున్నాడంటూ సంచలన ఆరోపణలు చేశాడు. 'అర్ష్‌దీప్ సింగ్ 15వ ఓవర్ వేస్తున్నప్పుడు బంతి రివర్స్ స్వింగ్ అవుతోంది. 15 ఓవర్లలోనే బంతి రివర్స్ స్వింగ్ అవ్వడం మామూలు విషయం కాదు. 12-13 ఓవర్లకే బంతి ఎలా రివర్స్ స్వింగ్ అవుతుంది? అంపైర్లు ఈ విషయంపై దృష్టి పెట్టాలి. అర్ష్‌దీప్ సింగ్, బంతిని ఏదో చేశాడు.. దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి..' అంటూ కామెంట్ చేశాడు ఇంజమామ్ ఉల్ హక్. 'దీని గురించి మీకు ఏం తెలుసు. వెస్టిండీస్‌లో పిచ్ ఎలా ఉంటుంది. ఎంత వేడి ఉంటుంది. వికెట్ల మీద ఏ మాత్రం తేమ ఉండదు. బంతి ఆటోమేటిక్‌గా రివర్స్ అవుతుంది. ప్రతీ టీమ్‌కి ఇలాగే జరుగుతోంది. కేవలం మా బౌలర్లు మాత్రమే ఇలా చేయడం లేదు.. ప్రతీ టీమ్‌లో రివర్స్ స్వింగ్ అవుతోంది.. కొన్నిసార్లు కాస్త బుర్ర పెట్టి ఆలోచించి, మాట్లాడాలి.. ఎక్కడ ఆడుతున్నాం, అక్కడి పరిస్థితులు ఏంటి అనేది చూడాలి.. మనం ఇంగ్లాండ్‌లో లేదా ఆస్ట్రేలియాలో మ్యాచులు ఆడడం లేదు.. ఇక్కడ కాకపోతే ఇంకెక్కడ స్వింగ్ అవుతుంది..' అంటూ రోహిత్ శర్మ కామెంట్స్ చేశాడు.


## శ్రీలంక హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ గుడ్ బై



**విశ్వంభర, స్పోర్ట్స్:** శ్రీలంక క్రికెట్ జట్టు హెడ్ కోచ్ పదవికి క్రిస్ సిల్వర్‌వుడ్ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవి నుంచి తప్పుకున్నట్లు లంక క్రికెట్ బోర్డు గురువారం వెల్లడించింది. అయితే, టీ20 వరల్డ్ కప్‌లో శ్రీలంక జట్టు చెత్త ప్రదర్శనతో కనీసం సూపర్-8 దశకు చేరుకోలేకపోయింది. లీగ్ దశలోనే ఇంటిబాటపట్టింది. ఇప్పటికే కన్సల్టెంట్ కోచ్‌గా ఉన్న మహేలా జయవర్ధనే సైతం తన పదవి నుంచి వైదొలిగాడు. ఈ క్రమంలో క్రిస్ సిల్వర్‌వుడ్ సైతం హెడ్‌కోచ్ పదవికి రాజీనామా గమనార్హం. 'అంతర్జాతీయ కోచ్‌గా ఉండడం అంటే.. చాలాకాలం పాటు సొంతవారికి దూరంగా ఉండాలి. కుటుంబంతో చర్చించాక భారమైన హృదయంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. స్వదేశానికి తిరిగి వెళ్లాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నాను.శ్రీలంక క్రికెట్‌లో భాగం కావడం నాకు నిజమైన గౌరవం. నేను ఇక్కడ ఎన్నో మధురమైన జ్ఞాపకాలను కూడగట్టుకున్నాను' అని సిల్వర్‌వుడ్ పేర్కొనట్లుగా బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. సిల్వర్ వుడ్ 2022 ఏప్రిల్‌లో శ్రీలంక జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన హయాంలో లంక జట్టు అదే ఏడాది జరిగిన ఆసియాకప్‌లో విజయం సాధించింది. ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగిన వన్డే ద్వైపాక్షిక సిరీస్‌లోనూ గెలుపొందింది. 2023 ఆసియా కప్‌లో రన్నరప్‌గా నిలిచింది. ఆరు నెలల్లో జరిగిన వన్డే ప్రపంచకప్, టీ20 వరల్డ్ కప్‌లో లంక జట్టు చెత్త ప్రదర్శనతో లీగ్ దశ నుంచే నిష్క్రమించింది. అలాగే, వచ్చే ఏడాది పాక్‌లో జరిగే ఐసీసీ చాంఫియన్స్ ట్రోఫీకి సైతం అర్హత సాధించలేకపోయింది. ఈ క్రమంలో హెడ్‌కోచ్ సిల్వర్‌వుడ్‌తో పాటు కన్సల్టెంట్‌గా ఉన్న జయవర్ధనే సైతం తమ పదవుల నుంచి తప్పుకున్నారు.

## ఆ క్రెడిట్ కార్డు వినియోగదారులకు


# అదిరిపోయే న్యూస్!



**విశ్వంభర, ఢిల్లీ:** భారతదేశంలో బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులు కారణంగా రోజురోజుకూ క్రెడిట్ కార్డుల వినియోగదారులు బాగా పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా బ్యాంకులు తమ వినియోగదారులకు అర్హతను బట్టి క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. ఒక్కో వినియోగదారుడికి రెండు నుంచి మూడు బ్యాంకుల క్రెడిట్ కార్డులు ఉ ంటున్నాయంటే వీటి వినియోగం మనం అర్థం చేసుకోవచ్చు. అయితే బ్యాంకులు మారుతున్న రూల్స్ ప్రకారం ఎప్పటికప్పుడు బ్యాంకింగ్ రూల్స్ కూడా మారుస్తాయి. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా నియో ఇన్ఫినిటీ, టాటా నియో ప్లస్ క్రెడిట్ కార్డ్ రూల్స్ తాజాగా మార్చాయి. ఈ నయా రూల్స్ ఆగస్ట్ 1, 2024 నుంచి అమలులోకి వస్తాయి. ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపుల కోసం ఈ కార్డ్‌లను ఉ పయోగించే కస్టమర్‌లు క్యాష్‌బ్యాక్ స్ట్రక్చర్‌లో సర్దుబాట్లను చేశారు. ఇదే విషయాన్ని ఈ-మెయిల్ నోటిఫికేషన్‌ల ద్వారా తెలియజేశారు. వినియోగదారులు టాటా నియో యూపీఐ ఐడీను ఉపయోగించి చేసిన అర్హత ఉన్న లావాదేవీలపై 1.5 శాతం నియో కాయిన్స్‌ను రివార్డ్‌లుగా అందుకుంటారు. పేటీఎం, ఫోన్ పే, క్రెడ్ వంటి ఇతర అర్హత ఉన్న యూపీఐ ఐడీల %×ణ%ల ద్వారా చేసే లావాదేవీలు 0.50 శాతం నియో కాయిన్స్‌ను పొందవచ్చు. అదేవిధంగా టాటా నియో ప్లస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ హోల్డర్‌లు టాటా నియో యూపీఐ ఐడీను ఉ పయోగించి అర్హత ఉన్న యూపీఐ లావాదేవీలపై 1 శాతం నియో కాయిన్స్, ఇతర అర్హత కలిగిన యూపీఐ ఐడీలను ఉపయోగించే లావాదేవీలపై 0.25 శాతం నియో కాయిన్స్‌ను పొందవచ్చు. ఈ మార్పులు కాకుండా టాటా నియో ఇన్ఫినిటీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు అదనపు ప్రోత్సాహకాలను అందిస్తుంది. వినియోగదారులు టాటా నియో యాప్ ద్వారా ఈఎంఐయేతర ఖర్చుల కోసం 10 శాతం నియో కాయిన్స్‌ను సంపాదించవచ్చు. అయితే భాగస్వామి టాటా బ్రాండ్‌లలో ఖర్చు చేస్తే 5 శాతం నియో కాయిన్స్ లభిస్తాయి. నాన్-టాటా బ్రాండ్ ఖర్చులు లేదా వ్యాపారి ఈఎంఐ ఖర్చులు 1.5 శాతం నియో కాయిన్స్‌తో రివార్డ్ వస్తాయి. అలాగే టాటా నియో ప్లస్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు టాటా న్యూ యాప్ ద్వారా ఈఎంఐ కాని ఖర్చులకు 7 శాతం నియో కాయిన్స్, భాగస్వామి టాటా బ్రాండ్‌లలో ఖర్చు చేసినందుకు 2 శాతం నియో కాయిన్స్‌ను అందిస్తుంది. టాటా నియో యాప్ ద్వారా రీఛార్జ్‌లు, బిల్లు చెల్లింపులు కూడా 2 శాతం నియో కాయిన్స్‌ను పొందుతాయి. రుసుములకు సంబంధించి టాటా న్యూ ఇన్ఫినిటీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లో చేరడం/పునరుద్ధరణ రుసుము రూ.1,499, వార్షికంగా రూ.3 లక్షలు ఖర్చు చేయడంపై వార్షిక రుసుము మినహాయింపు ఉంటుంది. మరోవైపు టాటా నియో ప్లస్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లో చేరడం/పునరుద్ధరణ రుసుము రూ.499. అయితే వార్షికంగా రూ. లక్ష ఖర్చు చేస్తే వార్షిక రుసుము మినహాయింపు లభిస్తుంది.

## జియో యూజర్లకు బిగ్ షాక్

### రీఛార్జ్ ప్లాన్ ధరలు పెంపు



**విశ్వంభర, ఢిల్లీ:** లోక్ సభ ఎన్నికల అనంతరం మొబైల్ రీఛార్జ్ టారిఫ్ ధరలు పెరుగుతాయని మొదట్లోనే ఊహాగానాలు వినిపించాయి. ఇప్పుడు అదే జరిగింది. టెలికం దిగ్గజాల్లో అగ్రగామి అయిన రిలయన్స్ జియో తమ యూజర్లకు గట్టి షాక్ ఇచ్చింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో టారిఫ్ ధరలను భారీగా పెంచుతున్నట్టుగా ప్రకటించింది. ఇప్పటికే ఉన్న జనాదరణ పొందిన ప్లాన్‌లు కొంచెం ఖరీదైనవిగా ఉన్నాయి. కొత్త ప్లాన్‌లు జూలై 3, 2024 నుంచి అమలులోకి వస్తాయి. 12.5 శాతం నుంచి అత్యధిక స్థాయిలో 25 శాతం వరకు మొబైల్ రీఛార్జ్ టారిఫ్ రేట్లు పెరగనున్నాయని కంపెనీ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొంది. తద్వారా జియో కస్టమర్లపై ప్రభావం పడనుంది. అంతేకా దు.. జియో కొత్త రీఛార్జ్ ప్లాన్లతో పాటు 5జీ అన్‌లిమిటెడ్ ప్లాన్లను కూడా ప్రవేశపెట్టింది. కొత్తగా సవరించిన రీఛార్జ్ ప్లాన్లు ఈరోజు నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. జియో బేస్ రూ. 155 ప్లాన్ తాజా పెంపుతో రూ. 189కి పెరిగింది. అంటే.. దాదాపు 22శాతం పెరిగింది. ఆశ్చర్యక రమైన విషయం ఏమిటంటే.. మరో టెలికం పోటీదారు అయిన భారతీ ఎయిర్‌టెల్ కన్నా ముందే ఈ పెంపును జియో ప్రకటించింది. టెల్కో 19 ప్లాన్‌లకు టారిఫ్ పెంపుదల ప్రకటించింది. ఇందులో 17 ప్రీపెయిడ్ ప్లాన్‌లు, 2 పోస్ట్‌పెయిడ్ ఆప్షన్లు ఉన్నాయి.

### జియో ప్లాన్ వివరాలను పరిశీలించినట్లతే..

బేస్ ఆఫర్ అయిన రూ. 155 ప్లాన్ ఇప్పుడు రూ. 189 అవుతుంది. అదే 28 రోజుల వ్యాలిడిటీని అందిస్తుంది. రూ.209 ప్లాన్ ఇప్పుడు రూ.249 అవుతుంది. అదే 28 రోజులు వ్యాలిడిటీని అందిస్తుంది. ఈ ప్లాన్‌ల డేటా ప్రయోజనాలు అలాగే ఉంటాయి. అందులో ఎలాంటి మార్పు ఉ ండదు. అన్‌లిమిటెడ్ 5జీ డేటాను అందించే రూ. 239 ప్లాన్ ఇకపై అలా ఉండదు. రూ.239 ప్లాన్ ఇప్పుడు రూ.299 అవుతుంది. 28 రోజుల పాటు వ్యాలిడిటీని అందిస్తుంది. ఇప్పుడు అన్‌లిమిటెడ్ 5జీ డేటా రోజుకు 2జీబీ డేటా, అంతకంటే ఎక్కువ ఉన్న ప్లాన్‌లలో మాత్రమే అం దుబాటులో ఉంటుందని గమనించండి. కొత్త ప్లాన్‌లు జూలై 3, 2024 నుంచి అమలులోకి వస్తాయి. టారిఫ్ పెంపుతో పాటు జియో జియోసేఫ్, జియో ట్రాన్సులేట్ ప్రకటించింది. జియోసేఫ్ అనేది కాలింగ్, మెసేజింగ్, ఫైల్ ట్రాన్స్‌ఫర్ మరిన్నింటికి క్వాంటం-సెక్యూర్ కమ్యూనికేషన్ యాప్, నెలకు రూ.199కి అందుబాటులో ఉంటుంది. జియోట్రా న్సులేట్ అనేది నెలకు రూ. 99కి వాయిస్ కాల్, వాయిస్ మెసేజ్, టెక్స్ట్, ఇమేజ్‌లను ట్రాన్సులేట్ చేయడానికి మల్టీ లాంగ్వేజీ కమ్యూనికేషన్ యాప్ అందిస్తుంది. జియో వినియోగదారులు నెలకు రూ. 298 విలువైన ఈ రెండు అప్లికేషన్‌లను ఒక ఏడాది పాటు పూర్తిగా ఉచితంగా పొందుతారని ప్రకటించింది.

# అవును.. మేము గొడవపడ్డం!

సినీ ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ మంచి గుర్తింపు తెచ్చుకుని దూసుకుపోతున్నారు. కానీ నాలుగు పదుల వయసు దాటినా కూడా గ్లామర్ తో ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లో త్రిష, నయనతార గురించి ప్రత్యేకంగా చెప్పకోవాలి. ఈ ఇద్దరూ ముద్దుగుమ్మలు తరగని అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఈ ఇద్దరూ హీరోయిన్స్ తమ తమ సినిమాలతో బిజీగా గడిపేస్తున్నారు. అయితే ఈ ఇద్దరు ముద్దుగుమ్మల మధ్య కోల్డ్ వార్ నడుస్తుందని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తూనే ఉంది. ఈ అయితే ఈ ముద్దుగుమ్మలు ఎందుకు ఎడమొహం..పెడమొహంగా ఉంటున్నారు. ఈ ఇద్దరి మధ్యలో గొడవకు కారణం ఓ సినిమా అని కోలీవుడ్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరూ హీరోయిన్స్ చాలా కష్టపడి హీరోయిన్స్ గా సక్సెస్ అయ్యారు. త్రిష చిన్న చిన్న క్యారెక్టర్స్ చేసుకుంటూ హీరోయిన్ గా మారి.. ఆ తర్వాత స్టార్ హీరోల సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే నయన్ కూడా కష్టపడి హీరోయిన్ గా ఎదిగింది. ఈ ఇద్దరూ స్టార్ హీరోలందరి సరసన నటించారు. తెలుగు, తమిళ్ భాషల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే ఇప్పడు భారీ రెమ్యునరేషన్స్ కూడా అందుకుం టున్నారు. కాగా ఈ స్టార్ హీరోయిన్స్ మధ్య ఒకానొక సందర్భంలో మంచి స్నేహం ఉండేది. కానీ ఇప్పడు కోల్డ్ వార్ నడుస్తుంది. గతంలో దీని పై స్వయంగా త్రిష మాట్లాడుతూ.. ఇద్దరి మధ్య విభేదాలు ఉన్న మాట నిజమే అని తెలిపింది. అయితే ఆ విభేదాలు వృత్తిపరమైన కారణాల వల్ల వచ్చినవి కాదని.. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చిందని అన్నారు త్రిష. ఆ తర్వాత కాలం గడుస్తున్నా కొద్దీ మేము ఒకరినొకరు అర్థం చేసుకున్నామని తెలిపింది. దాంతో ఇప్పడు మేము మంచి స్నేహితులం అయ్యాము అని చెప్పకొచ్చింది త్రిష. అయితే ఈ ఇద్దరికీ మధ్య గ్యాప్ రావడానికి ఓ సినిమా కారణం అని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో నయన్ కురివి అనే సినిమా కోసం హీరోయిన్ గా ఎంపిక అయ్యింది. కానీ చివరిలో ఆమె స్థానంలోకి త్రిష వచ్చింది. ఈ సినిమాతోనే ఈ ఇద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయని కోలీవుడ్ లో టాక్ వినిపిస్తుంది. ఇక ఈ ఇద్దరి సినిమాల విషయాని కొస్తే.. త్రిష తెలుగులో చిరంజీవితో విశ్వంభర సినిమా చేస్తుంది. అలాగే అజిత్ తో ఓ సినిమా చేస్తుంది. అటు నయన్ కూడా తన సినిమాలతో బిజీగా ఉంది.







## కేకపుట్టించేలా.. మిత్రా శర్మ

బిగ్ బాస్ రియాలిటీ గేమ్ షో కోసం ప్రేక్షకులు ఈగర్ గా ఎదురుచూస్తునారు. ఇప్పటికే ఏడూ సీజన్స్ పూర్తి చేసుకున్న బిగ్ బాస్ ఇప్పుడు ఎనిమిదో సీజన్ కోసం రెడీ అవుతుంది. ఏడూ డైరెక్ట్ సీజన్స్ తో పాటు ఓ ఓటీటీ సీజన్ ను కూడా పూర్తి చేసుకుంది బిగ్ బాస్.. డిస్నీ హాట్ స్టార్‌లో ఈ ఓటీటీ సీజన్ స్ట్రీమింగ్ అయ్యింది. కాగా ఈ బిగ్ బాస్ ఓటీటీ సీజన్ లో బిందు మాధవి విన్నర్ గా నిలిచింది. అయితే ఈ ఓటీటీ సీజన్ లో పాల్గొన్న కంటెస్టెంట్స్ ఓ ఓ ముద్దుగుమ్మ మాత్రం అందరి దృష్టిని ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఆమె మిత్రా శర్మ. తన అందంతో ఆటతో ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ బ్యూటీ. బిగ్ బాస్ తర్వాత ఈ చిన్నదానికి విపరీతమైన ఫాలోయింగ్ వచ్చింది. నిజానికి బిగ్ బాస్ కంటే ముందు ఈ అమ్మడు చాలా మందికి తెలియదు. బిగ్ బాస్ తర్వాత ఈ బ్యూటీ పేరు గట్టిగా వినిపించింది. బిగ్ బాస్ ఓటీటీలో టాప్ 5 కంటెస్టెంట్స్ లో ఒకరిగా నిలిచింది మిత్రా.. ఇక బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత సినిమాలతో బిజీగా మారుతుందని అంతా అనుకున్నారు కానీ అలా జరగలేదు. హీరోయిన్ గా గతంలో కొన్ని సినిమాల్లో నటించిన మిత్రా శర్మ తర్వాత ప్రొడ్యూసర్ గా మారింది. ప్రముఖ యూట్యూబర్ హర్ష సాయి హీరోగా ఆమె ఓ సినిమాను నిర్మిస్తుంది. ఈ సినిమా అనౌన్స్ చేసి చాలా కాలం అయ్యింది. కానీ ఇంతవరకు దాని గురించి ఎలాంటి అప్డేట్ లేదు.యువ తారగా, నిర్మాతగా, సమాజసేవతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ చిన్నది. డీలర్ కి మరోవైపు, అలోకికా, ఆమె ఎవరు.? తొలి సంధ్య వేళలో సినిమాల్లో నటించింది మిత్రా.. కానీ ఈ సినిమాలు పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. అయితే ఈ అమ్మడు ఇప్పుడు ఏం చేస్తుంది.? ఎలా ఉంది అని గూగుల్ ను గాలిస్తున్నారు. మిత్రా శర్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఫోటోలు, రకరకాల వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడి లేటెస్ట్ ఫోటోలు, వీడియోలు వైరల్ గా మారాయి.

## శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ..



టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల కెరీర్‌లో మరో బిగ్ స్టెప్ తీసుకోబోతున్నారు. ఇన్నాళ్లు తెలుగుతో పాటు కన్నడ సినిమాలు మాత్రమే చేసిన ఈ బ్యూటీ, ఇప్పుడు ఏకంగా బాలీవుడ్ వైపు అడుగులు వేస్తున్నారు.ఆల్రెడీ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌కు ఈ బ్యూటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల కెరీర్‌లో మరో అడుగు ముందుకు వేస్తున్నారు. ఆల్రెడీ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌కు ఈ బ్యూటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల కెరీర్‌లో మరో అడుగు ముందుకు వేస్తున్నారు.ఆల్రెడీ సౌత్‌లో ఫుల్ బిజీగా ఉన్న ఈ బ్యూటీ ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతున్నారు. ఓ సక్సెస్‌ఫుల్ హీరోతో క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించేందుకు శ్రీలీల గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న టాక్ వినిపిస్తోంది.ఆల్రెడీ సౌత్‌లో ఫుల్ బిజీగా ఉన్న ఈ బ్యూటీ ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతున్నారు. ఓ సక్సెస్‌ఫుల్ హీరోతో క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించేందుకు శ్రీలీల గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్న టాక్ వినిపిస్తోంది.ప్రజెంట్ వరుసగా సౌత్ బ్యూటీస్‌తోనే సినిమాలు చేస్తున్నారు వరుణ్ ధావన్. సిటాడెల్ వెబ్ సిరీస్‌లో సమంతతో కలిసి నటించారు.ప్రజెంట్ వరుసగా సౌత్ బ్యూటీస్‌తోనే సినిమాలు చేస్తున్నారు వరుణ్ ధావన్. సిటాడెల్ వెబ్ సిరీస్‌లో సమంతతో కలిసి నటించారు.ప్రజెంట్ సెట్స్ మీద ఉన్న బేబీ జాన్ సినిమాలో కీర్తి సురేష్‌తో జోడి కడుతున్నారు. ఆ తరువాత చేయబోయే సినిమా విషయంలో సౌత్ బ్యూటీకే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.ప్రజెంట్ సెట్స్ మీద ఉన్న బేబీ జాన్ సినిమాలో కీర్తి సురేష్‌తో జోడి కడుతున్నారు. ఆ తరువాత చేయబోయే సినిమా విషయంలో సౌత్ బ్యూటీకే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ట్రయాంగులర్ లవ్ స్టోరిలో హీరోగా నటిస్తున్నారు వరుణ్. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్, శ్రీలీల హీరోయిన్‌గా కనిపించబోతున్నారు.డేవిడ్ ధావన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ట్రయాంగులర్ లవ్ స్టోరిలో హీరోగా నటిస్తున్నారు వరుణ్. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్, శ్రీలీల హీరోయిన్‌గా కనిపించబోతున్నారు. జూలైలో ప్రారంభం కానున్న ఈ సినిమాను అక్టోబర్‌లోనే రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. దీంతో త్వరలోనే శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ ఉండబోతుందన్న న్యూస్ ట్రెండ్ అవుతోంది.జూలైలో ప్రారంభం కానున్న ఈ సినిమాను అక్టోబర్‌లోనే రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. దీంతో త్వరలోనే శ్రీలీల బాలీవుడ్ డెబ్యూ ఉండబోతుందన్న న్యూస్ ట్రెండ్ అవుతోంది

## నాగార్జున ఫొటోపై మనసు పారేసుకున్న టబు

టాలీవుడ్ ఇండస్ట్రీలో ఎంతోమంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. అందులో ఒకప్పటి స్టార్ హీరోయిన్ టబు గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాదాపు స్టార్ హీరోలు అందరి సరసన నటించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంది. ఇక ఈ బ్యూటీ బాలీవుడ్ లోనూ నటిస్తూ మంచి గుర్తింపును తెచ్చుకుంది. అక్కడ వచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం




చేసుకుంటూ మంచి క్రేజ్ ని తెచ్చుకుంది. ఇక కొన్ని రోజులపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన టబు అలా వైకుంఠపురం సినిమాతో మళ్ళీ రీఎంట్రీ ఇచ్చింది. ఈ భామకి 52 ఏళ్ళు వచ్చినప్పటికీ ఇంకా వివాహం చేసుకోకుండా సింగిల్ గానే ఉంటుంది.ఇది ఇలా ఉండగా తాజాగా.. అక్కినేని నాగార్జున ఫోటో పై షాకింగ్ కామెంట్స్ చేసింది టబు. మొన్న ఫాదర్స్ డే రోజు నాగచైతన్య షేర్ చేసిన ఫోటోపై టబూ స్పందించారు. మూడు రెడ్ హార్ట్ ఎమోజీలను కూడా షేర్ చేశారు టబు. ప్రస్తుతం టబూ హాట్ సింబల్స్ షేర్ చేయడంతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. కాగా, అక్కినేని నాగార్జున అలాగే టబూ ఇద్దరు రిలేషన్షిప్ లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అంతేకాకుండా నాగర్జున, టబు పెళ్లి చేసుకుంటారని కూడా కొంతమంది ప్రచారం చేశారు. ఆ వార్తలకు చెక్ పెడుతూ అమలను వివాహం చేసుకున్నాడు అక్కినేని నాగార్జున.

## పిల్లల మెదడును దెబ్బతీస్తున్న శబ్దం..

**విశ్వంభర, ఫీచర్:** పెరుగుతున్న శబ్దం మన జీవితాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని మనందరికీ తెలుసు. అయితే ఇది పిల్లల మెదడుకు తీవ్రమైన హాని కలిగిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న శబ్దం మన చెవులకు మాత్రమే కాదని.. పిల్లలకు కూడా హాని కలిగిస్తుందని తాజా అధ్యయనం తేలింది.. ట్రాఫిక్, ఇతర వనరుల నుండి వచ్చే శబ్దం పిల్లల ఏకాగ్రత, అభ్యాస సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది వారి చదువులో కూడా సమస్యలను కలిగిస్తుంది అనే షాకింగ్ వాస్తవాన్ని తాజా అధ్యయనం వెల్లడించింది. జర్మనీలోని మ్యూనిచ్‌లో ఉన్న హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు ఈ అధ్యయనం చేశారు. 5 నుండి 12 సంవత్సరాల వయస్సు గల 500 మందికి పైగా పిల్లలను అధ్యయనంలో చేర్చారు. ఈ పిల్లలు వివిధ స్థాయిల శబ్దంతో కూడిన వాతావరణంలో చదువుకొని కొన్ని పనులను పూర్తి చేయవలసిందిగా కోరారు. ధ్వనించే వాతావరణాలకు గురైన పిల్లలు ఏకాగ్రత, అభ్యాసానికి సంబంధించిన పనులపై తక్కువ పని చేస్తారని అధ్యయన ఫలితాలు కనుగొన్నాయి. శబ్దం వారి జ్ఞాపకశక్తిని, ఏకాగ్రత, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కూడా బలహీనపరిచింది.

**శబ్దం వల్ల ఒత్తిడి-చిరాకు**

శబ్దం మెదడులో ఒత్తిడిని కలిగిస్తుందని, ఇది ఏకాగ్రతకు, అభ్యాస ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. శబ్దం కారణంగా, మెదడు చాలా కష్టపడాల్సి వస్తుంది. ఇది అలసట, చిరాకును కూడా పెంచుతుంది. ఈ అధ్యయనం పిల్లల ఆరోగ్యం, విద్యపై ముఖ్యమైన ప్రభావాలను కలిగి ఉంది. శబ్ద కాలుష్యం చెవులకు మాత్రమే కాకుండా, పిల్లల మానసిక వికాసాన్ని కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని ఇది చూపిస్తుంది.



**పరిష్కారం ఏమిటి?**

అధ్యయనం ఆధారంగా, పాఠశాలలు, నివాస ప్రాంతాలలో శబ్దం స్థాయిలను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. అలాగే, పిల్లలను శబ్దం నుండి రక్షించడానికి, వారికి ఇంట్లో నిశ్శబ్ద వాతావరణం కల్పించాలి. పిల్లల అభివృద్ధి, విద్య గురించి ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కూడా ఈ అధ్యయనం ముఖ్యమైనది. వారు శబ్దం నుండి పిల్లలను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. నిశ్శబ్ద వాతావరణాన్ని అందించడానికి ప్రయత్నించాలి..

## ప్లాస్టిక్ బాటిళ్లలో నీళ్లు తాగే అలవాటుందా?

**ఆ ప్రమాదకర వ్యాధిని కొనితెచ్చుకున్నట్లే..**

**విశ్వంభర, ఫీచర్ :** నేటికాలంలో నీటి కోసం ప్లాస్టిక్ బాటిళ్లను ఉపయోగించడం దాదాపు సర్వ సాధారణ విషయంగా మారింది. అయితే ఇది మీ ఆరోగ్యానికి పెను ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల, అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ 2024 సైంటిఫిక్ సెషన్‌లో సమర్పించిన ఒక అధ్యయనం ప్లాస్టిక్ సీసాలు, ఆహార కంటైనర్‌లలో ఉపయోగించే పారిశ్రామిక రసాయనమైన BPA మధుమేహ ప్రమాదాన్ని పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. BPA అంటే బిస్ఫినాల్ A,.. ఈ ప్లాస్టిక్ ను ఆహారం, పానీయాల ప్యాకేజింగ్‌లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. మునుపటి అధ్యయనాలు మానవ హార్మోన్లను నిరోధించే సామర్థ్యాన్ని కూడా హైలైట్ చేశాయి. ఈ కొత్త అధ్యయనం BPAని తగ్గించిన ఇన్సులిన్ సెన్సిటివిటీకి అనుసంధానించే ప్రత్యక్ష సాక్ష్యాలను అందించింది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ (రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువ కాలం ఉండేలా చేస్తుంది) టైప్ 2 డయాబెటిస్‌కు ఇది ప్రధాన ప్రమాద కారకం.. అని వైద్య పరిశోధకులు తెలిపారు.

**నిపుణులు ఏమంటున్నారంటే..?**

అధ్యయనం సీనియర్ రచయిత.. కాలిఫోర్నియా పాలిటెక్నిక్ స్టేట్ యూనివర్శిటీ ప్రొఫెసర్ టాడ్ హగోబియన్ మాట్లాడుతూ.. ఈ ఫలితాలు బహుశా US పర్యావరణ పరిరక్షణ ఏజెన్సీ ద్వారా నిర్దేశించబడిన సురక్షిత మోతాదులను పునఃపరిశీలించాలని, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు ఈ మార్పుల గురించి రోగులకు తెలియజేయాలని.. సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రస్తుతం, ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (FDA) BPA స్థాయిలను కిలోగ్రాము శరీర బరువుకు 5 మిల్లీగ్రాముల వరకు ఆహార కంటైనర్‌లలో సురక్షితంగా పరిగణిస్తారు. కొత్త అధ్యయనంలో ప్రమాదకరమైనదిగా గుర్తించిన విలువ కంటే ఈ పరిమాణం 100 రెట్లు ఎక్కువ. ఇది 2024 చివరి నాటికి ఆహారం లేదా పానీయాలతో సంబంధం ఉన్న ఉత్పత్తులలో BPAని నిషేధించాలని కొంతమంది పరిశోధకులు డిమాండ్ చేస్తున్నారు.



**ప్రమాదకరమైనవి..**

BPAపై ఆందోళనలు రోజువారీ వస్తువులు, పదార్థాలలో సంభావ్య హానికరమైన పదార్థాలకు గురికావడం గురించి విస్తృతంగా హెచ్చరిస్తున్నారు. అటువంటి పదార్థాల దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలను అర్థం చేసుకోవడం టైప్ 2 డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడానికి మెరుగైన ఎంపికలను చేయడంలో సహాయపడుతుంది. యునైటెడ్ స్టేట్స్లో మధుమేహం మరణానికి ప్రధాన కారణం అయినందున.. ఈ వ్యాధికి దోహదపడే చిన్న కారకాలను కూడా అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం అని హగోబియన్ పత్రికా ప్రకటనలో తెలిపారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com